**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 40, పేజీలు - 08

బుధవారం, ఆగష్టు 5, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







# తెలంగాణ అసెంబ్లీలో కాళేశ్వరం సెషన్స్

**- అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో కాళేశ్వరమే సెంటర్ టాపిక్ - కాంగ్రెస్ వ్యూహం.. బీఆర్ఎస్ ఎదుర్కొంటుందా.?**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్తతలకు వేదికగా మారింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మొదటి నుంచి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నేరుగా అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని విసురుతున్న సవాళ్లు.. ఈసారి సభలో తీవ్ర దుమారం రేపేలా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రూ. లక్ష కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం, మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు, నిధుల వినియోగంపై జరగనున్న చర్చే ఈ సమావేశాల్లో ప్రధానాంశంగా మారనుంది.

### బీఆర్ఎస్‌కు రివర్స్ అయిన మేడిగడ్డ ఇష్యూ

కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయంగా, పరిపాలనాపరంగా తమకు ప్రధాన ఆయుధంగా మార్చుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుండగా, రైతుల నీటి అవసరాలను చూపుతూ ప్రభుత్వాన్ని కార్నర్ చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నించింది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో మేడిగడ్డ నుంచి నీళ్లను ఎత్తిపోయాలి అని చేపట్టిన నిరసనలు, క్షేత్రస్థాయి ఉద్యమాలు రాజకీయాన్ని వేడెక్కించాయి. అయితే, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఎల్లంపల్లి నుంచి వరద నీరు సహజంగానే తిరిగి మేడిగడ్డ వైపు ప్రవహించడం, బ్యారేజీ సాంకేతిక పరిమితులు బయటపడటంతో బీఆర్ఎస్ ఒక్కసారిగా తీవ్ర ఆత్మరక్షణలో పడింది. ఇరిగేషన్ నిపుణులు, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలను ముందుపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం వేస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పడం బీఆర్ఎస్‌కు సవాలుగా మారింది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిన పరిస్థితుల్లో నీటిని నిల్వ చేయడం లేదా పంపింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమని ప్రభుత్వం వాదిస్తుంటే బీఆర్ఎస్ మాత్రం కేవలం పొలాలకు నీళ్లు ఇవ్వకుండా నాటకాలు

2లో..

## అహంకారం వినాశనానికి దారితీస్తుంది

**- ఉదయనిధి అరెస్ట్‌పై ఎంకే స్టాలిన్ కీలక వ్యాఖ్యలు**



**చెన్నై (ప్రశ్న న్యూస్)** తమిళనాడు ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్‌పై డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్రంగా మండిపడ్డారు. నటి త్రిషపై చేసిన వ్యాఖ్యల కేసులో ఉదయనిధి స్టాలిన్‌ను అరెస్టు చేసిన విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ప్రభుత్వాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. ప్రజల అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ఎక్స్ వేదికగా స్పందించిన ఎంకే స్టాలిన్ అహంకారం వినాశనానికి దారి తీస్తుంది. మొండితనంతో కూడిన అహంకారం

2లో..

## పకడ్బందీగా పోలీసు ఉద్యోగ నియామకాల భర్తీ

**- పరీక్షలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలన్న సీఎం రేవంత్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 7,437 పోస్టుల భర్తీ ప్రక్రియపై నిఘా వర్గాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కీలక సమాచారం అందించాయి. నియామక ప్రక్రియకు ఎలాగైనా భంగం కలిగించాలని కొన్ని రాజకీయ పార్టీలతో పాటు ఇతర శక్తులు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నట్టు నిఘా వర్గాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు ప్రభుత్వ, పోలీస్ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇటీవల విడుదలైన నోటిఫికేషన్‌కు సంబంధించి నియామక ప్రక్రియను పకడ్బందీగా, పూర్తి పాదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. నియమ నిబంధనలను అనుసరించి ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

2లో..

## గోదావరి కేంద్రంగా జగన్ కొత్త స్కెచ్

**అనూహ్య నిర్ణయం - కీలక మలుపు!**




**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీ రాజకీయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. 2029 ఎన్నికలే లక్ష్యంగా ఇప్పటి నుంచే కొత్త లెక్కలు మొదలయ్యాయి. కూటమి– వైసీపీ పోటా పోటీ రాజకీయం పతాక స్థాయికి చేరింది. వచ్చే ఎన్నికల కోసం

2లో..

# వాళ్లది విధ్వంసం, మాది పునర్నిర్మాణం

**- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల**

- గత పాలనలో రాష్ట్రం రూ.9.74 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందన్న సీఎం
- రెండేళ్లలో రూ.1.49 లక్షల కోట్ల సంక్షేమం, రూ.30,607 ఉద్యోగాలు అందించాం
- అమరావతి, పోలవరం పూర్తి చేసి తీరతామని స్పష్టం చేసిన చంద్రబాబు
- రాష్ట్రంలో సంక్షేమం ఆగదు, అభివృద్ధీ ఆగదన్న చంద్రబాబు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు, సంక్షేమ–అభివృద్ధి పురోగతిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమగ్ర ప్రొగ్రెస్ రిపోర్ట్ ను విడుదల చేశారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. 2019–2024 మధ్య కాలంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాగించిన వేధింపులు, అణచివేత చర్యల వల్లనే ప్రజలు నిశ్శబ్ద విప్లవం ద్వారా తమ కూటమికి 57 శాతం ఓట్లు, 94 శాతం స్ట్రైక్ రేట్‌తో చారిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టారని గుర్తుచేశారు. అధికారం చేపట్టిన కొత్తలో గత వైఫల్యాలను ఎండగడుతూ ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశామని, ఇప్పుడు ఆ శ్వేతపత్రాల కొనసాగింపుగా రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు తాము చేపట్టిన చర్యల యాక్షన్ టేకెన్ రిపోర్టును ప్రజల ముందుంచుతున్నామని సీఎం స్పష్టం చేశారు. 2014 రాష్ట్ర విభజననాటి పరిస్థితులను చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఆర్థిక సంపదను కోల్పోయి, రాజధాని కూడా లేక బస్సుల నుంచే పాలన సాగించినప్పటికీ మొదటి విడతలో రాష్ట్రాన్ని దారిలో పెట్టేందుకు తీవ్రంగా శ్రమించామన్నారు. విభజన సమయంలో నాటి ఉమ్మడి రాష్ట్రంలో తలసరి ఆదాయం రూ. 95,231 కాగా, విభజన అనంతరం తెలంగాణ తలసరి ఆదాయం రూ. 1,24,104కు పెరిగి, ఏపీ ఆదాయం రూ. 93,903కు పడిపోయిందని గణాంకాలను వివరించారు. విభజన వల్లే ఇరు రాష్ట్రాల మధ్య రూ. 30,201 భేదం ఏర్పడిందని, అయితే 2019 నాటికి తాము నిలబెట్టిన రాష్ట్ర ప్రాభవాన్ని గత ఐదేళ్ల పాలనతో దారుణంగా దెబ్బతీశారని ఆరోపించారు. గత ప్రభుత్వ వైఖరి వల్ల ఏపీ బ్రాండ్ ఇమేజ్ ఘోరంగా పడిపోయిందని, పారిశ్రామికవేత్తలు భయపడి రాష్ట్రం విడిచి పారిపోయారని చంద్రబాబు మండిపడ్డారు. ప్రభుత్వ వ్యవస్థలు, పోలీసులు, అధికారులు భయంతో బతికేలా వాతావరణం సృష్టించారని దుయ్యబట్టారు. ఇతర రాష్ట్రాల్లో ఏపీ వాసులను చిన్నచూపు చూసే పరిస్థితి తీసుకొచ్చారని వ్యాఖ్యానించారు. ఆదాయం రావాలన్నా, ఉద్యోగాలు లభించాలన్నా

2లో..

## అక్కడో నీతి.. ఇక్కడో నీతి

**- ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్‌పై కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిపై ఫిర్యాదు చేయడం ప్రతి పౌరుడికి రాజ్యాంగబద్ధమైన హక్కు అని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో కేసు నమోదు చేసిన పోలీసు అధికారిని తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం బదిలీ చేయడం చట్టాన్ని అమలు చేసే అధికారుల మనోధైర్యాన్ని దెబ్బతీసే చర్య అని కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఢిల్లీలో మంగళవారం మీడియాతో మాట్లాడిన కిషన్‌రెడ్డి.. మెటా సంస్థపై కేసు నమోదు చేసిన డీసీపీ ఆనంద్‌బాబును తెలంగాణ సర్కార్ బదిలీ చేసిందని ఆరోపించారు. రాజ్యాంగం ప్రకారం విధులు నిర్వహించిన అధికారిని శిక్షించినట్టేనని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకే సీఎం రేవంత్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపిస్తూ చట్ట ప్రకారం పనిచేసే అధికారులపై ప్రభుత్వం వేటు వేస్తోందని అన్నారు. ఈ సందర్భంగా తమిళనాడు రాజకీయ

2లో..

## క్షుద్రపూజలు చేయడం బీఆర్ఎస్‌కు అలవాటు

- మాజీ మంత్రి హరీశ్ రావు ఆలయాల పర్యటనలపై ప్రశ్నలు
- జూన్ 2, జులై 23 తేదీల్లో హరీశ్ ఎక్కడున్నారో చెప్పాలని డిమాండ్
- పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని పట్టించుకోలేదన్న మహేష్ గౌడ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావుపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. రాష్ట్రంలో వర్షాలు పడకుండా పంటలు పండకుండా కరువు పరిస్థితులు ఏర్పడాలని హరీశ్‌రావు క్షుద్ర పూజలు చేస్తున్నారని ఆరోపణలు చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్.. తాను చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు కూడా ఉన్నాయని పేర్కొనడం

2లో..

## హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికపై కాంగ్రెస్ ఫోకస్

**- సమర్థవంతమైన అభ్యర్థికోసం వేట**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో మరోసారి ఎన్నికలు జరగనున్నాయి. రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు వచ్చే ఏడాది మార్చిలో ఎన్నికలు జరగనున్నాయి. హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్ నగర్, వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగన్నాయి. ఈ ఎన్నికల సంగ్రామానికి కాంగ్రెస్ పార్టీ అప్పుడే సై అంటుంది. అధికారంలో ఉండటంతో అన్ని పార్టీలకంటే కాంగ్రెస్ పార్టీ ఒక అడుగు ముందుకేసింది. ఈ రెండు స్థానాల్లో గెలుపొందడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే ఫోకస్ పెట్టింది. అంతేకాదు గెలుపు గుర్రాలపై కూడా దృష్టిపెట్టింది. ఈ క్రమంలో హైదరాబాద్ జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై జిల్లా ఇన్ చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తాజాగా అభిప్రాయ సేకరణ షురూ చేశారు.

### - బలమైన అభ్యర్థిక ఎంపికే లక్ష్యం

హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ పట్టభద్రుల నియోజకవర్గం ఉంది. దీంతో ఇక్కడ సమర్థవంతమైన అభ్యర్థిని బరిలోకి దించితే గానీ గెలుపొందలేని పరిస్థితి. అందువల్ల ఇప్పటి నుంచే బలమైన అభ్యర్థిని బరిలోకి దించేందుకు పార్టీ పరంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అభిప్రాయాలు సేకరిస్తున్నారు. అభ్యర్థి ఎంపికకు సంబంధించి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, పార్టీ ముఖ్య నాయకుల నుంచి లిఖితపూర్వకంగా అభిప్రాయాలను మంత్రి పొన్నం ప్రభాకర్ చేపట్టారు. పార్టీ పరంగా సమర్థవంతమైన అభ్యర్థి ఎంపికకు స్థానిక నాయకుల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి వచ్చిన సూచనలు, అభిప్రాయాలను

2లో..

## ఇకపై మండల కేంద్రాల్లో 'ప్రజావాణి'

**- తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో ఉన్న స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు గుడ్ గవర్నెన్స్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజల వద్దకే పాలన, ప్రజా ప్రభుత్వం అనే విధానాలను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు ఉన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించే విధంగా కీలక ముందడుగు వేసింది. ఇకపై మండల కేంద్రాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం తాజాగా అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి నోడల్ అధికారిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ) వ్యవహరించనున్నారు. మండల స్థాయిలో

2లో..

## యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై వివరణ ఇవ్వండి

**- ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ట్రస్టు బోర్డు ఏర్పాటుపై వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బోర్డు ఏర్పాటు నిమిత్తం తీసుకువచ్చిన చట్ట సవరణతో పాటు

2లో..

# తెలంగాణ అసెంబ్లీలో కాళేశ్వరం సెషన్స్

ఆడుతోందని ఆరోపించింది. అయితే, వరద నీటి సహజ ప్రవాహం, ఎల్లంపల్లి బ్యాక్ వాటర్ పరిణామాలు క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ వాదనకే బలాన్ని చేకూర్చడంతో, సోషల్ మీడియాలో సైతం బీఆర్ఎస్ రక్షణ ధోరణిలో పడాల్సి వచ్చింది.

### కేసీఆర్‌ను రప్పించాలని రేవంత్ టార్గెట్

ఈ వర్షాకాల సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వ్యూహం అత్యంత స్పష్టంగా ఉంది. కేసీఆర్‌ను నేరుగా అసెంబ్లీకి రప్పించడం ద్వారా, ఆయన సమక్షంలోనే కాళేశ్వరం డిజైన్ లోపాలు, పీసీ ఘోష్ కమిషన్ విచారణ పురోగతి, మరియు రాష్ట్రంపై పడిన ఆర్థిక భారాన్ని ఎండగట్టాలని కాంగ్రెస్ భావిస్తోంది. గత సమావేశాలకు కేసీఆర్ దూరంగా ఉండటాన్ని రేవంత్ రెడ్డి రాజకీయంగా వాడుకుంటూ ప్రతిపక్ష నేతగా సభకు వచ్చి తమ హయాంలో జరిగిన నిర్మాణాలను సమర్థించుకోవాలని సవాల్ విసురుతున్నారు. మరోవైపు, బీఆర్ఎస్ వర్గాలు కూడా ఈ సమావేశాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. కాళేశ్వరం అంశంలో సాంకేతిక లోపాలను సరిదిద్దకుండా ప్రభుత్వం రాజకీయం చేస్తోందని, ఆరుగాలం కష్టపడే రైతులకు సాగునీరు అందించడంలో విఫలమైందని సభలో తిప్పికొట్టేందుకు కేటీఆర్, హరీష్ రావులు వ్యూహాలు రచిస్తున్నారు. అయితే, కేసీఆర్ స్వయంగా అసెంబ్లీకి వస్తారా లేదా అనేది ఇంకా ఉత్కంఠగానే మారింది. ఒకవేళ కేసీఆర్ సభకు హాజరైతే రేవంత్-కేసీఆర్ మధ్య జరిగే ప్రత్యక్ష సభ సమరం తెలంగాణ రాజకీయ చరిత్రలోనే అత్యంత కీలకమైన ఘట్టంగా మారనుంది.

### ఇతర సమస్యలనూ ప్రస్తావించాలనుకుంటున్న బీఆర్ఎస్

ఈ వర్షాకాల సమావేశాల్లో కాళేశ్వరంపై జరిగే చర్చ ప్రజాభిప్రాయాన్ని తీవ్రంగా ప్రభావితం చేయనుంది. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ రీ-డిజైన్ వైఫల్యం గా ప్రజల్లో శాశ్వతంగా ముద్ర వేయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తుంటే కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టు ఎండిపోతోంది అని నిరూపించేందుకు బీఆర్ఎస్ పోరాడుతోంది. అదే సమయంలో నిరుద్యోగ సమస్యలు సహా రాష్ట్రంలో ఉన్న అన్ని అంశాలను హైలెట్ చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నించడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ అసెంబ్లీ సమావేశాలు కేవలం చట్టసభల చర్చలకే పరిమితం కాకుండా, రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయ గమనాన్ని నిర్దేశించే అత్యంత కీలక పోరాట వేదికగా మారడం ఖాయంగా కనిపిస్తోంది.

# అహంకారం వినాశనానికి దారితీస్తుంది

మరింత వేగంగా పతనానికి కారణమవుతుంది అంటూ ఎంకే స్టాలిన్ వ్యాఖ్యానించారు. కావేరి జలాల అంశం, మేకేదాటు డ్యామ్ ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకే ఉదయనిధిని అరెస్టు చేశారని ఆరోపించారు. తంజావూరులో నిర్వహించిన డీఎంకే నిరసనలో రైతులు, పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొనడం ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తికి నిదర్శనమని ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. కావేరి జలాల విషయంలో ప్రభుత్వం తీసుకున్న వైఖరినే ఉదయనిధి స్టాలిన్ విమర్శించారని దానికి సమాధానం చెప్పాల్సింది పోయి అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. ఉదయనిధి స్టాలిన్‌ను విచారణ కోసం చెన్నైలోనే ప్రశ్నించవచ్చని అయితే ఎందుకు తంజావూరుకు తరలించారని ఎంకే స్టాలిన్ ప్రశ్నించారు. ప్రశ్నించడం మాత్రమే ఉద్దేశమైతే అనేక నాన్ బెయిలబుల్ సెక్షన్లు ఎందుకు నమోదు చేశారని నిలదీశారు. ఆ తర్వాత మద్రాస్ హైకోర్టులో ప్రభుత్వం విచారణ అనంతరం విడుదల చేస్తామని చెప్పడం తమ వాదనకు బలం చేకూరుస్తుందని పేర్కొన్నారు. నటి త్రిషపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన కేసులో సోమవారం ఉదయం పోలీసులు ఉదయనిధి స్టాలిన్‌ను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై ఆయన తరపు న్యాయవాదులు హైకోర్టును ఆశ్రయించగా విచారణ అనంతరం విడుదల చేయాలని హైకోర్టు ఆదేశించింది. మద్రాస్ హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ప్రశ్నించిన తర్వాత ఉదయనిధి స్టాలిన్‌ను స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

# పకడ్బందీగా పోలీసు ఉద్యోగ నియామకాల భర్తీ

### - దళారులపై నిఘా ఉంచండి

పోలీసు ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణాతో పాటు అన్ని ప్రక్రియలలో అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. పరీక్ష కేంద్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ముఖ్యంగా కోచింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. నియామక పరీక్షల నిర్వహణపై సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ఎలాంటి దుష్ప్రచారం జరగకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసే దళారులు, నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా అకౌంట్లపై సైబర్ క్రైమ్ విభాగంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణ పూర్తయ్యే వరకు సైబర్ సెక్యూరిటీ, ఇంటెలిజెన్స్ విభాగం పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ అత్యవసర సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి శేషాద్రి, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖాగోయల్, పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ వీవీ శ్రీనివాసరావు, హైదరాబాద్ సీపీ సీవీ సజ్జనార్ పాల్గొన్నారు.

### - 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్-2026లో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్‌లు ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. అయితే ఇందుకు సంబంధించిన దరఖాస్తుల తేదీలను పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు శనివారం (ఆగస్టు 1) విడుదల చేసింది. ఆగస్టు 19వ తేదీ నుంచి సెప్టెంబర్ 9వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపింది. పోలీస్, ఎస్‌పీఎఫ్, అగ్నిమాపక శాఖ, జైళ్ల శాఖలలోని వివిధ పోస్టులకు సంబంధించిన మొత్తం 7,437 ఖాళీలను భర్తీ చేయడానికి తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి జూలై 29న నాలుగు నోటిఫికేషన్లు విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ నోటిఫికేషన్లకు సంబంధించి ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ విధానంలో మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తామని పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు స్పష్టం చేసింది. దరఖాస్తులను టీఎస్ఎల్పీఆర్బీ వెబ్‌సైట్ లో ఆగస్టు 19 (బుధవారం) ఉదయం 8 గంటల నుండి సెప్టెంబర్ 9 (బుధవారం) సాయంత్రం 5 గంటల వరకు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొంది.

# గోదావరి కేంద్రంగా జగన్ కొత్త స్కెచ్



కొత్త ప్రణాళికలు అమలు చేస్తున్నారు. వైసీపీ లక్ష్యంగా కూటమి ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ వైసీపీ ప్రజల్లోకి వెళ్తున్నాయి. ఈ సమయంలోనే గోదావరి జిల్లాలు కేంద్రంగా మాజీ సీఎం జగన్ కొత్త వ్యూహాలు అమలు చేస్తున్నారు. ఏపీలో రాజకీయ లెక్కలు మారుతున్నాయి. వచ్చే ఎన్నికలే లక్ష్యంగా కొత్త సమీకరణాలు తెర మీదకు వస్తున్నాయి. రాష్ట్రంలో అధికారంలోకి రావాలంటే కీలకమైన గోదావరి జిల్లాల పైన మాజీ సీఎం జగన్ ప్రత్యేకంగా గురి పెట్టారు. అక్కడ సమస్యల పైన వేగంగా స్పందిస్తున్నారు. ఇప్పటికే ఆ రెండు జిల్లాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాల పైన పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేస్తున్నారు. వైసీపీకి చెందిన కాపు నేతలు గోదావరి కేంద్రంగాకే కీలక సమావేశం నిర్వహించారు. అదే విధంగా త్వరలో బీసీ సమావేశం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. పార్టీ నిర్ణయించిన నిరసలు గోదావరి జిల్లాల్లో బలంగా నిర్వహించాలని నిర్దేశించారు. కోనసీమ నేతలతో సమావేశం సమయం లో జగన్ గోదావరి కేంద్రంగా భవిష్యత్ కార్యాచరణ పైన పార్టీ నేతలకు స్పష్టత ఇచ్చారు.

### - జగన్ కొత్త కార్యాచరణ

ఇక, గోదావరిలో రైతుల సమస్యల పైన జగన్ వెంటనే స్పందిస్తున్నారు. భీమవరం కేంద్రంగా ఆక్వా రైతుల సమస్య పైన జరిగిన సభలో జగన్ పాల్గొన్నారు. ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. అదే విధంగా ఉండి వంటి కీలక నియోజకవర్గంలో పార్టీ ఇంఛార్జ్ ను మార్పు చేసారు. వచ్చే ఎన్నిక ల కోసం సిద్దం చేస్తున్నారు. ఇప్పుడు మరో నిర్ణయం తీసుకున్నారు. రేపు (బుధవారం) తూర్పు గోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. దేవరపల్లి పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, కొనుగోళ్ల తీరును పరిశీలించడంతోపాటు పొగాకు రైతులతో నేరుగా మాట్లాడనున్నారు. ఇప్పటికే పొగాకు రైతులు జగన్ తో సమావేశం అయ్యారు. రైతుల పక్షాన నిలబడేందుకు తాను వస్తానని చెప్పారు. పర్యటనలో భాగంగా అక్కడి పొగాకు కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న కొనుగోళ్లను పరిశీలిస్తారు. అనంతరం పొగాకు రైతులతో ముఖాముఖి నిర్వహించి, ఇబ్బందులపై వారితో నేరుగా చర్చిస్తారు. దీంతో.. గోదావరి కేంద్రంగా జగన్ వరుసగా అమలు చేస్తున్న కార్యచరణ ఇప్పుడు రాజకీయంగా ఆసక్తి కరంగా మారుతోంది.

# వాళ్లది విధ్వంసం, మాది పునర్నిర్మాణం

పెట్టుబడులు అత్యంత కీలకమని, అందుకే ఆర్థిక వ్యవస్థను మళ్లీ స్థిరత్వంలోకి తెచ్చేందుకు గడిచిన రెండేళ్లలో ప్రత్యేక సంస్కరణలు, నూతన పారిశ్రామిక విధానాలు తెచ్చామన్నారు. పరిస్థితులు ఎంత క్లిష్టంగా ఉన్నప్పటికీ, తమ సమర్థవంతమైన ప్రణాళికల వల్ల రాష్ట్రాన్ని పునర్నిర్మాణ మార్గంలో నడిపిస్తున్నామని సీఎం ధీమా వ్యక్తం చేశారు. గత ఐదేళ్ల సంక్షోభం నుంచి కోలుకుంటూ ఏపీ జీఎస్‌డీపీ 13.5 శాతంగా నమోదు కావడం, సీఏజీఆర్ వృద్ధి 30.5 శాతానికి చేరడం చారిత్రాత్మక విజయమని పేర్కొన్నారు. అప్పుల-జీఎస్‌డీపీ నిష్పత్తిని 28.38 శాతంగా నియంత్రిస్తూనే, తెలంగాణతో ఉన్న ఆదాయ అంతరాన్ని 10 శాతం నుంచి 8 శాతానికి తగ్గించగలిగామని గణాంక సహితంగా వెల్లడించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నామని సీఎం వివరించారు. ఇచ్చిన హామీల మేరకు చెప్పిన తేదీల్లోనే ఎవ్వరూ ఊహించని విధంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని అభివృద్ధి బాట పట్టించేందుకు ఇరిగేషన్, స్టీల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఐటీ, ఫార్మా రంగాల్లో భారీ ఎత్తున ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నామని ప్రకటించారు. బ్రాండ్ ఏపీని తిరిగి పునరుద్ధరించి, పెట్టుబడుల ప్రవాహంతో ప్రతి కుటుంబంలో ఆదాయం పెంచడమే తమ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

# అక్కడో నీతి.. ఇక్కడో నీతి

పరిణామాలను ప్రస్తావించిన కిషన్‌రెడ్డి కాంగ్రెస్ మద్దతుతో ఉన్నటీవీకే ప్రభుత్వంలో ముఖ్యమంత్రి విజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్‌ను అరెస్ట్ చేసినవిషయాన్ని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. అలాంటప్పుడు తెలంగాణలో మాత్రం కేసులు నమోదు చేసిన అధికారులనే శిక్షించడం ఎందుకు అని కేంద్రమంత్రి ప్రశ్నించారు. ఈ క్రమంలోనే తమిళనాడులో ఒక నీతి ఇక్కడ తెలంగాణలో మరో నీతి ఉంటుందా అని కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఇలాంటి వ్యాఖ్యలు వస్తే కూడా ఇదే వైఖరి ఉంటుందా అని నిలదీశారు.

సోషల్ మీడియా సంస్థలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థపై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని కూడా కిషన్‌రెడ్డి ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ ద్వారా అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహా విధానాన్ని అనుసరిస్తోందని విమర్శించారు. ఈ వ్యవహారంపై బీజేపీ నేత సాయి గౌడ్ కూడా స్పందించారు. దేశ ప్రజలను అవమానించేలా సోషల్ మీడియాలో పోస్టులు వెలువడిన నేపథ్యంలో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. పోస్టులు చేసిన వారెవరో విచారణలో తేలుతుందని మెటా ఇండియాపై కూడా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని పేర్కొన్నారు. అయితే ఈ కేసును నమోదు చేసిన పోలీసు అధికారిపై ప్రభుత్వం ఒత్తిడి తెస్తోందనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు.

# ఇకపై మండల కేంద్రాల్లో 'ప్రజావాణి'

ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి నిర్వహించాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే ఆన్ లైన్ లోనూ ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించేలా పోర్టల్ ను సిద్ధం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆదేశాలిస్తూ పౌర సంబంధాల శాఖ సమగ్ర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రజావాణి కార్యక్రమానికి తహసీల్దార్, ఎంపీఓ, ఎంఏఓ, ఎంఈఓ, పీహెచ్ సీ అధికారులు అలాగే సీడీపీఓ, వెల్ఫేర్ ఆఫీసర్లు, విద్యుత్, నీటి పారుదల, అటవీశాఖ, రోడ్లు- భవనాలు ఇతర ముఖ్య శాఖలకు సంబంధించిన దాదాపు 23 రకాల మండల స్థాయి అధికారులంతా తప్పనిసరిగా పాల్గొనాల్సి ఉంటుందని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇంతకుముందు ప్రజలు తమ భూ సమస్యలు, పెన్షన్ సమస్యలు, రేషన్ కార్డు సమస్యలు, ఇతర స్థానిక మౌలిక వసతుల దరఖాస్తుల కోసం జిల్లా కలెక్టరేట్ల వరకూ వెళ్లాల్సిన అవసరం ఏర్పడేది. దాంతో ప్రజలకు రవాణా ఖర్చులు, ప్రయాణ సమయం పెరిగేది. కానీ ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మండల స్థాయిలోనే ప్రజా సమస్యలు పరిష్కారం కానున్నాయి. రాష్ట్రంలోని ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించి ప్రజా పాలన అందించి పారదర్శకంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ కీలక ముందడుగు వేసింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై వివరణ ఇవ్వండి

బోర్డు ఏర్పాటుపై ప్రభుత్వంతో పాటు ట్రస్ట్ బోర్డు చైర్మన్, సభ్యులకూ నోటీసులు జారీ చేసింది. దేవాదాయ శాఖ చట్టానికి సవరణ తీసుకువస్తూ చేర్చిన సెక్షన్లు 96, 97లతో పాటు ఆలయానికి ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జూన్ 30న జారీ చేసింది. ఈ జీవోను సవాలు చేస్తూ నాగిళ్ల శ్రీనివాస్, వ్యవస్థాపక ట్రస్టీ నరసింహ మూర్తిలు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారణ చేపట్టింది. రూ.100 కోట్ల ఆదాయం ఉన్న ఆలయానికి ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయవచ్చని, అందులో ఎమ్మెల్యేతోపాటు వంశపారంపర్య ధర్మకర్త తదితరులు సభ్యులుగా ఉంటారని పేర్కొందని, ఇది చట్టవిరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. గతంలో సుప్రీం కోర్టు వెలువరించిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ట్రస్ట్ బోర్డు ఏర్పాటైందని పేర్కొన్నారు. ఈ తీర్పు ప్రకారం వంశపారంపర్య ధర్మకర్త ఉన్నపుడు ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేస్తే దానికి చైర్మన్గా వంశపారంపర్య దర్మకర్తనే నియమించాలని స్పష్టంగా ఉందన్నారు. వారికి ప్రత్యేక హక్కును కల్పించిందన్నారు.

వ్యవస్థాపక ట్రస్టీకి ఉన్న ప్రత్యేక హోదాను తగ్గించి కేవలం ఒక సభ్యుడిగా మాత్రమే నియమించారన్నారు. అంతేగాకుండా రాజ్యాంగంలోని అధికరణ 24, 25 ప్రకారం ఆలయ బోర్డులో ప్రజాప్రతినిధులకు అవకాశం ఇవ్వకూడదన్నారు. ఆలయ నిత్య కైంకర్యాలు, పూజావిధానాలు, ఉత్సవాలు, ఆగమ సంప్రదాయాల నిర్వహణ వంటి అత్యంత కీలక బాధ్యతలను అప్పగించిందన్నారు. ఇవి కేవలం పరిపాలనాపరమైన అంశాలే కాకుండా మతపరమైనవని, అందువల్ల ఇలాంటి వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యంతో హిందూ మత సంస్థలకు రాజ్యాంగం కల్పించిన స్వయం ప్రతిపత్తి దెబ్బతింటోందన్నారు. వాదనలను విన్న ధర్మాసనం సీఎస్, దేవాదాయశాఖ కమిషనర్, ఆలయ ఈవో, చైర్మన్ ఎం.సత్యనారాయణ రెడ్డికి నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

# హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికపై కాంగ్రెస్ ఫోకస్

సమగ్రంగా పరిశీలించి పార్టీ అధిష్ఠానానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి హోదాలో పొన్నం ప్రభాకర్ నివేదించనున్నారు.

### - పార్టీ అధిష్టానానికి నివేదిస్తా

హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ పరంగా కీలకమైన అభిప్రాయ సేకరణ ప్రక్రియను ప్రారంభించినట్లు ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 'పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, పార్టీ ముఖ్య నాయకుల నుంచి లిఖితపూర్వకంగా అభిప్రాయాలను సేకరించాలని నా కార్యాలయం ద్వారా చర్యలు చేపట్టాను. పార్టీ బలోపేతానికి, సమర్థవంతమైన అభ్యర్థి ఎంపికకు స్థానిక నాయకుల అభిప్రాయాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తాను. ప్రతి నియోజకవర్గం నుంచి వచ్చిన సూచనలు, అభిప్రాయాలను సమగ్రంగా పరిశీలించి పార్టీ అధిష్ఠానానికి నివేదిస్తాను'అని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

### - ఓటరు నమోదుపై దృష్టి పెట్టండి

అదే విధంగా హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల పార్టీ ఇంచార్జిలు పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించాను. అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు అయ్యేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని పార్టీ నాయకులందరూ సమన్వయంతో విజయవంతం చేయాలని, ప్రతి నియోజకవర్గంలో నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలి అని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

# క్షుద్రపూజలు చేయడం బీఆర్ఎస్‌కు అలవాటు

ఇప్పుడు పెను సంచలనంగా మారింది. ఈ ఏడాది జూన్ 2వ తేదీన తమిళనాడులోని తిరుచ్చి జూలై 23వ తేదీన కర్ణాటకలోని శివమొగ్గ ప్రాంతాలను హరీశ్‌రావు సందర్శించారని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఆ తేదీల్లో ఆయన ఎక్కడ ఉన్నారో ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుచ్చి, శివమొగ్గలో క్షుద్ర పూజలు నిర్వహించే ఆలయాలు ఉన్నాయని పేర్కొన్న టీపీసీసీ చీఫ్ ఆ పర్యటనలపై హరీశ్‌రావు వివరణ ఇవ్వాలని కోరారు. తెలంగాణ ప్రజలు కష్టాల్లో పడాలని కరువు రావాలని కోరుకుంటూ రాజకీయ స్వార్థం కోసం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ప్రజల సంక్షేమం కోసం దేవుడిని ప్రార్థించడం సహజమని కానీ ప్రజలకు నష్టం కలగాలని కోరుకోవడం బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. ఇక మాజీ సీఎం కేసీఆర్‌పైనా గతంలో ఇలాంటి ప్రచారం జరిగిందని గుర్తు చేసిన మహేష్ కుమార్ గౌడ్ ఇప్పుడు హరీశ్‌రావుపై వస్తున్న ఆరోపణలు ఆ అనుమానాలను మరింత బలపరుస్తున్నాయని వ్యాఖ్యానించారు. యాదగిరిగుట్టకు వెళ్లి చేసిన పూజల గురించి కూడా ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో ఈ అంశంపై ప్రశ్నలు లేవనెత్తిన కాంగ్రెస్ నేతలు అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్‌లకు లీగల్ నోటీసులు పంపినా తాము వెనక్కి తగ్గేది లేదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కాగా టీపీసీసీ చీఫ్ చేసిన ఈ ఆరోపణలపై హరీశ్‌రావు, బీఆర్ఎస్ పార్టీ నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది.

# బాధిత కుటుంబాలకు రూ.20 లక్షల ప్రమాద బీమా చెక్కులు అందజేత

### - తెలంగాణ గ్రామీణ బ్యాంకు
### - వీడ్స్ సి.ఎఫ్.ఎల్ సంయుక్త ఆధ్వర్యంలో పంపిణీ



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా తోగుట మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు, వీడ్స్ సి.ఎఫ్.ఎల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రమాదాల్లో మృతి చెందిన ఇద్దరు బాధితుల కుటుంబాలకు రూ.20 లక్షల విలువైన ప్రమాద బీమా చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. తోగుటకు చెందిన కల్లుగీత కార్మికుడు సిలివెరి మల్లేశం ఈత చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందగా, ఆయన భార్య, నామినీ సిలివెరి లలితకు రూ.20 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. అలాగే చందాపూర్ గ్రామానికి చెందిన రైతు చంద నర్సయ్య వ్యవసాయ పనులు చేస్తుండగా కరెంట్ షాక్‌కు గురై మృతి చెందడంతో, ఆయన కుమారుడు మరియు నామినీ చంద కృష్ణకు రూ.20 లక్షల బీమా చెక్కును అందించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రజలు బ్యాంకులు అందించే వివిధ బీమా పథకాలపై అవగాహన పెంచుకొని, ప్రమాద బీమా వంటి పథకాలలో చేరడం ద్వారా తమ కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ రాజయ్య, తోగుట శాఖ మేనేజర్ జలంధర్, ఫీల్డ్ ఆఫీసర్ ప్రణీత్, క్యాషియర్ రవికుమార్, చందాపూర్ సర్పంచ్ చంద లావణ్య స్వామి, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ఇన్‌చార్జ్ శ్రీకాంత్, కృష్ణ, అలాగే వీడ్స్ సి.ఎఫ్.ఎల్ కౌన్సిలర్లు ఎ. శ్రీనివాస్, బి. స్వామి, సిహెచ్. రాజు తదితరులు పాల్గొన్నారు.

# డ్వాక్రా మహిళలకు భారీ ఊరట..

### - రుణాలపై కీలక ఛార్జీలు రద్దు చేసిన ఏపీ గ్రామీణ బ్యాంకు

**విజయవాడ,** ఆంధ్రప్రదేశ్‌లోని డ్వాక్రా మహిళా సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు డ్వాక్రా సంఘాలు తీసుకునే రుణాలపై పలు రకాల సేవా ఛార్జీలను రద్దు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) ప్రకటించింది.

ఈ నిర్ణయం వల్ల బ్యాంకు పరిధిలోని సుమారు 30 లక్షల మంది మహిళలకు ఏటా రూ. 500 కోట్ల మేర ఆర్థిక లబ్ధి చేకూరుతుందని అంచనా. జులై 1 నుంచి తీసుకున్న రుణాలకు ఈ రద్దు వర్తిస్తుంది. డ్వాక్రా సంఘాల రుణాలపై బ్యాంకులు రకరకాల పేర్లతో ఛార్జీలు వసూలు చేసేవి. ఇప్పటికే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), యూనియన్ బ్యాంకులు ప్రాసెసింగ్, తనిఖీ ఫీజులను నిలిపివేయగా, తాజాగా వాటి సరసన ఏపీ గ్రామిణ బ్యాంకు చేరింది. ఈ నిర్ణయంతో ప్రాసెసింగ్ ఫీజు, ఇన్‌స్పెక్షన్ ఫీజు, డాక్యుమెంటేషన్ ఛార్జీలు, లెడ్జర్ ఫోలియో ఛార్జీలు, పాస్‌బుక్ అప్‌డేట్ ఫీజులు, ఎస్‌హెచ్‌జీ స్టేట్‌మెంట్ ప్రింటింగ్, నగదు నిర్వహణ ఛార్జీలు వంటివి పూర్తిగా రద్దయ్యాయి. దీంతో పాటు రూ. 5 లక్షలు దాటిన రుణాలపై వడ్డీ రేటును 13 శాతం నుంచి 12 శాతానికి తగ్గించింది.

గతంలో రుణ మొత్తంతో సంబంధం లేకుండా 0.5 శాతం ప్రాసెసింగ్ ఫీజు ఉండేది. ఉదాహరణకు, రూ. 20 లక్షల రుణం తీసుకున్న బృందానికి ప్రాసెసింగ్ ఫీజు రద్దుతోనే ఏటా రూ. 10,000 ఆదా అవుతుంది. వడ్డీ రేటు తగ్గింపుతో మరో రూ. 15,000 వరకు ప్రయో జనం కలుగుతుంది. ప్రతి మూడు నెలలకోసారి విధించే తనిఖీ ఫీజులు, ఇతర ఛార్జీల రూపం లో గతంలో ఏటా రూ. 10,000 వరకు భారం పడేది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 11 లక్షల డ్వాక్రా సంఘాలలో 1.10 కోట్ల మంది సభ్యులు ఉండగా, ఒక్క ఏపీ గ్రామిణ బ్యాంకు పరిధి లోనే సుమారు 3 లక్షల సంఘాలు, 30 లక్షల మంది సభ్యులు ఉన్నారు. ఈ నేపథ్యంలో బ్యాంకుతీసుకున్న తాజా నిర్ణయం లక్షలాది కుటుంబాలకు నేరుగా ప్రయోజనం చేకూర్చనుంది.

### ఇతర బ్యాంకులూ అనుసరించాలి: మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఏపీ గ్రామిణ బ్యాంకు నిర్ణయాన్ని సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్వాగతించారు. "డ్వాక్రా మహిళలు తీసుకునే రుణాలపై వేస్తున్న సేవా ఛార్జీలను ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు, గ్రామిణ బ్యాంకులు నిలిపేస్తూ నిర్ణయం తీసుకోవడం హర్షణీయం.

ఇతర బ్యాంకులు కూడా ఇదే తరహాలో రద్దు చేసి మహిళా సాధికారతకు తమ వంతు సహకారం అందించాలి. మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దడంలో భాగంగా వారిపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకే సీఎం చంద్రబాబు బ్యాంకులను సంప్రదిస్తూ సేవా ఛార్జీలను మాఫీ చేయిస్తున్నారు" అని ఆయన తెలిపారు. గతంలో జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలోనూ డ్వాక్రా రుణాలపై సుమారు 15 రకాల ఛార్జీలు విధిస్తున్నారని, వాటిని తగ్గించాలని సీఎం బ్యాంకులను కోరిన విషయం తెలిసిందే

# కిడ్నాప్ కేసులో వైసీపీ నేత అరెస్ట్..

**గుంటూరు** వైసీపీ నేత, గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫాను పోలీసులు అరెస్ట్ చేశారు. కిడ్నాప్ కేసుకు సంబంధించి గత కొన్ని రోజులుగా పరారీలో ఉన్న ఆయన్ను నూజివీడు పోలీసులు గుజరాత్‌లో అదుపులోకి తీసుకున్నారు. సాంకేతిక నిఘా సాయంతో ముస్తఫా ఆచూకీని గుర్తించి అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఇటీవల పొగాకు లోడ్‌తో వెళ్తున్న ఒక వాహనాన్ని ముస్తఫా కుమారుడు, అతని అనుచరులు అడ్డగించారు. ఆ వాహనంలో ఉన్న పొగాకు వ్యాపారితో పాటు మరో వ్యక్తిని కిడ్నాప్ చేసి బంధించారు. బాధితుల కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, వారు రంగంలోకి దిగి కిడ్నాప్‌కు గురైన ఇద్దరినీ సురక్షితంగా విడిపించారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా తొలుత ముస్తఫా కుమారుడిపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు. అయితే, విచారణలో ఈ కిడ్నాప్‌తో మాజీ ఎమ్మెల్యే ముస్తఫాకు కూడా సంబంధం ఉన్నట్లు తేలింది. దీంతో ఆయనపై కిడ్నాప్, బెదిరింపుల కింద కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి ముస్తఫా అజ్ఞాతంలోకి వెళ్లగా, చివరకు సాంకేతిక ఆధారాలతో ఆయన గుజరాత్‌లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడకు వెళ్లి అరెస్ట్ చేశారు. ముస్తఫా అరెస్ట్‌ను పోలీసులు అధికారికంగా ధ్రువీకరించారు.

# గుడివాడ రైతు బజార్‌లో తక్కువ ధరల బియ్యం కౌంటర్

# ప్రారంభించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

- ప్రజలకు బియ్యం అందిస్తూ తక్కువ ధరకు స్టీమ్,రా బియ్యం విక్రయాలు మొదలుపెట్టిన....ఎమ్మెల్యే
- పనిచేసే ప్రభుత్వమంటే కూటమి ప్రభుత్వమే...గుడివాడ అభివృద్ధికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం
- పవన్ కళ్యాణ్ సహకారం - వర్షం వస్తే నీళ్లలో కూరగాయలు అమ్మే రైతు బజార్... అభివృద్ధిని కళ్లారా చూస్తున్నాం....
- అందరం కలిసి మన ఊరును స్పెషల్ గుడివాడగా... ఎన్టీఆర్ గుడివాడగా మార్చుకుందాం
- 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ...రైతు సంక్షేమానికి పెద్దపీట
- బహిరంగ మార్కెట్ క్వాలిటీనే తక్కువ ధరకు ఇస్తున్నాం:రైస్ మిల్లర్స్.

**గుడివాడ** ప్రజలకు మంచి జరుగుతుందంటే కూటమి ప్రభుత్వం సత్వరమే స్పందిస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. పేద వర్గాలకు మేలు చేసేందుకు ఏర్పాటుచేసిన తక్కువ ధరకు బియ్యం విక్రయ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గుడివాడ రైతు బజార్‌లో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తగ్గింపు ధరల బియ్యం విక్రయ ప్రత్యేక కౌంటర్లను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మంగళవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనుగోలుదారులకు బియ్యం అందించి విక్రయాలను ఎమ్మెల్యే రాము లాంఛనంగా ప్రారంభి, బియ్యం నాణ్యతను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రాము మాట్లాడారు....కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలకు మంచి చేసే అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు మేలు జరుగుతుందనుకుంటే ప్రభుత్వం, మేము అందరం సత్వరమే స్పందించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ధరలు పెరుగుతున్నాయన్న ఉద్దేశంతో తక్కువ ధరకు ప్రజలకు బియ్యం అందించాలనే లక్ష్యంతో మంత్రి నాదెండ్ల మనోహర్ 23వ తేదీన ఈ ప్రక్రియను ప్రారంభించారనీ అన్నారు. కేవలం 8 రోజుల వ్యవధిలో సంబంధిత చర్యలను పూర్తి చేయడమే కాకుండా యాప్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారనీ తెలిపారు. ఇదే కూటమి ప్రభుత్వ గొప్పతనమని ,పనిచేసే ప్రభుత్వమంటే కూటమి ప్రభుత్వమేనని ఆయన ఉద్ఘాటించారు. ప్రజలకు మంచి జరగాలనే లక్ష్యంతో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి స్టీమ్, రా బియ్యాన్ని తక్కువ ధరకే అందిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలనీ పిలుపునిచ్చారు. రైతులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందనీ, ధాన్యం విక్రయించిన 24 గంటల్లోపు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడం చాలా గొప్ప విషయం అన్నారు. గతంలో జనవరిలో వచ్చిన సంచులు రాని పరిస్థితి ఉండేదనీ, ధాన్యం అమ్మిన నెలల తర్వాత కూడా డబ్బు జమ కాక రైతులు అనేక ఇబ్బందులు పడేవారనీ గుర్తు చేశారు. రాష్ట్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారనీ, వారి సహకారంతో గుడివాడలో అనేక మార్పులు వచ్చాయన్నారు. మనం ఉన్న గుడివాడ రైతు బజార్ గతంలో వర్షం వస్తే నీళ్లలో కూరగాయలు అమ్మేవారు. ఇప్పుడు ఎంత మారిందో కళ్లారా చూడవచ్చనీ తెలిపారు. ప్రజలందరితో కలిసి పనిచేస్తే ఎంత సాధించవచ్చో సీఎం చంద్రబాబు చూపించారన్నారు. గొప్ప గొప్ప కార్యక్రమాలు చేసుకుంటూ మన ఊరు స్పెషల్ గుడివాడగా అభివృద్ధి చేసుకుంటూ... అన్న ఎన్టీఆర్ గుడివాడగా మార్చుకుందామని ఎమ్మెల్యే రాము ఆకాంక్షించారు. కూటమి నాయకులు మాట్లాడుతూ...రాష్ట్రంలోని 115 రైతు బజార్లలో, 500 వరకు రైస్ మిల్లుల లేఅవుట్‌లలో మనిషికి 10 కిలోల చొప్పున బియ్యం విక్రయాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ మంచి కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూజిల్లాలోని అన్ని రైతు బజార్లతో పాటు, 30 రైస్ మిల్ పాయింట్ల ద్వారా విక్రయాలు ప్రారంభించామని తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో ఏ క్వాలిటీ ఉంటుందో అదే క్వాలిటీని తక్కువ ధరకు 10 కిలోల వరకు ఇస్తున్నాం అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాత్రగడ్డ రవికుమార్, గుడివాడ జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్,గుడివాడ తాసిల్దార్ ప్రసాద్,పిడిఎఫ్ డి.టీ విజయలక్ష్మి, గుడివాడ టిడిపి అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య, రైతు బజార్ ఈవో ఓగిరాల శ్రీకాంత్, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, గోకవరపు సునీల్, రామిదేని వేణు, షేక్ జానీ, దేవరపల్లి కోటి, దారపురెడ్డి మనీశ్వరరావు, రఫీ, వంగపండు ఆదినారాయణ, గొర్ల శ్రీలక్ష్మి, సిరిపురపు తులసిరాని, యార్లగడ్డ సుధారాణి, కంచర్ల సుధాకర్, అందుగుల ఏసు పాదం ,ఇమ్మానుయేలు, వసంతవాడ దుర్గారావు, అడుసుమిల్లి శ్రీనివాస్, కోడూరు ప్రభు, సయ్యద్ మున్వర్, షేక్ సర్కార్, అల్లాడ శ్రీనివాస్,జనసేన నాయకులు గుండు వెంకట్రావు, ఇంటరూ గజేంద్ర, కొదమల గంగాధర్ ,షేక్ నాగూర్ భాష,రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వీరయ్య చౌదరి, గుడివాడ అధ్యక్షులు టీవీఎస్ ప్రసాద్, జి నరసింహారావు, జి రామకృష్ణ, ఎస్ జగ్గారావు, బి కృష్ణమోహన్రావు , సిహెచ్ కృష్ణ ప్రసాద్, పలువురు కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## కారేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**కారేపల్లి,** ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మంగళవారం కారేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్ పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులు, శాంతిభద్రతల పరిస్థితి, నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా స్వీకరించి నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల విచారణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధుల నిర్వహణ తీరును పరిశీలించిన కమిషనర్, ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పోలీసింగ్‌ను తీర్చిదిద్దాలని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం స్టేషన్ అధికారులు, సిబ్బందితో సమావేశమైన కమిషనర్ శాఖ పనితీరు మరింత మెరుగుపడేందుకు అవసరమైన పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు

## అక్కడ ఏలుతున్నది డ్యాకుమెంట్ రైటర్లే

**వరంగల్** అక్కడ డాక్యుమెంట్ రైటర్లదే హవా కొనసాగుతున్న విమర్శలు వినిపిస్తున్నాయి. వరంగల్ జిల్లాలోని మారుమూల ప్రాంతంలో ఉన్న ఓ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్లు చెప్పినట్టు పని జరుగుతుందనే నమ్మకం అక్కడి ప్రజల్లో నెలకొందంటే అతిశయోక్తి కాదేమో. వరంగల్ పట్టణానికి సుమారు 40 , 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న నర్సంపేట సబ్ రిజిస్టర్ కార్యాలయంలో దళారీల దందా యదేచ్ఛగా సాగుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్కు ఉన్న వినికిడి లోపాన్ని ఆసరాగా చేసుకొని దళారీలు డాక్యుమెంట్ రైటర్లు అడ్డు అదుపు లేకుండా అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు డాక్యుమెంట్ ను చూపించి చూపించనట్టుగా వ్యవహరిస్తూ తెలివిగా రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం ఇక్కడ సర్వసాధారణంగా మారిందన్న ప్రచారం సాగుతుంది. మారుమూల ప్రాంతం కావడం ఎక్కువ శాతం మంది ప్రజలు విద్యావంతులు కాకపోవడం , సబ్ రిజిస్టర్ లో ఉన్న వినికిడి లోపాన్ని ఆసరాగా చేసుకుని అక్కడ పనిచేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు దళారీల సంపాదన మూడు పువ్వులు ఆరు కాయలు అన్న రీతిలో కొనసాగుతుందని ప్రజల ఆరోపిస్తున్నారు. దళారీల ఆగడాలను డాక్యుమెంట్ రైటర్ల చేష్టలను నిరోధించాల్సిన సబ్ రిజిస్టర్ ఇతర సిబ్బంది తమకేందిలే అనే రీతిలో వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజల ఆరోపిస్తున్నారు. డాక్యుమెంట్ రైటర్ల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని వారిని నియంత్రించనట్లయితే ప్రజలు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని కొంతమంది బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కీలుబొమ్మగా మారిన సబ్ రిజిస్టర్. డాక్యుమెంట్ రైటర్ల చేతిలో అక్కడ పనిచేస్తున్న సబ్ రిజిస్టర్ ఓ కీలుబొమ్మగా మారాడు అన్న విమర్శలు నెలకొన్నాయి. ఆ కారణంగానే గత కొంతకాలం క్రితం దీర్ఘకాలిక ఆయన సెలవుపై వెళ్ళినట్టు జోరుగా ప్రచారం సాగింది. గతంలో నర్సంపేట సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అనేక అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అమాయకులైన ప్రజలను వినికిడి లోపంతో ఉన్న రిజిస్టర్ ను డాక్యుమెంట్ రైటర్లు దళారీలు సొమ్ము చేసుకుంటున్నారని ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. లెక్కకు మిక్కిలిగా డాక్యుమెంట్ రైటర్లు , దళారీలు ఉండడంతో అందులో ఎవరు నమ్మకస్తులో కాదో తెరవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంకు వచ్చే ప్రజలకు నాణ్యమైన సేవలు చేసేవారు ఎవరో తెలుసుకోవడం కష్టంగా మారిందని ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. డాక్యుమెంట్ రైటర్లలో కొంతమందిని మచ్చిక చేసుకొని ఆ సబ్ రిజిస్టర్ ఎక్కువ రిజిస్ట్రేషన్ లను అతనికి పంపించి ఎక్కువ మొత్తంలో మామూలు పొందుతున్నారని ఆరోపణలు నెలకొన్నాయి. గతంలో తెలంగాణ ప్రభుత్వం డాక్యుమెంట్ రైటర్లకు ప్రభుత్వం చే గుర్తింపు కార్డులు ఇవ్వడం కోసం చేసిన ప్రయత్నాలు ఇప్పటివరకు ఫలించలేదు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికైనా డాక్యుమెంట్ రైటర్లకు గుర్తింపు కార్డులు ఇచ్చి పరిమిత సంఖ్యలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలా చేసినట్లయితే డాక్యుమెంట్లలో ఏవైనా పొరపాట్లు జరిగితే వారి గుర్తింపును రద్దు చేయడంతో పాటు వాళ్ళపైన చర్యలు తీసుకునే అవకాశాలు ఉంటాయని మేధావులు కోరుతున్నారు. ఈ క్రమంలో జిల్లా స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ రిజిస్టర్ చొరవ తీసుకొని కార్యాలయాన్ని తనిఖీ చేసి అక్రమాలపై నిజా నిజాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

## వరద ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలించిన మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్** కరీంనగర్ నగరంలోని 26వ డివిజన్ సుభాష్ నగర్‌లో భారీ వర్షాలకు ఓ ఇంటిలోకి వరద నీరు చేరిన ఘటనపై నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మంగళవారం సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.

మున్సిపల్ సిబ్బందితో కలిసి ఇంటిలోని వరద నీటిని తొలగించే పనులను పర్యవేక్షించి, బాధిత కుటుంబానికి అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండి సమస్యలపై వెంటనే స్పందించాలని మేయర్ ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ రాజ మనోహర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అండర్‌బ్రిడ్జ్ సమస్యలను పరిష్కరించండి

**- రైల్వేమెంబర్ అన మాస శ్రీనివాస్**

**గోదావరిఖని** సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని రైల్వే అండర్‌బ్రిడ్జ్‌లలో నీరు నిలిచిపోవడం వలన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మీద అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరింగ్ శ్రీ వాస్తవ్ కి డివిజనల్ రైల్వే మెంబర్ అనమాస శ్రీనివాస్ జీన్స్ మెమోరండం ఇవ్వడం జరిగినది రామగుండం, ఓదెల కోత్తపల్లి మంచిర్యాల మరియు సమీప ప్రాంతాల మధ్య ప్రయాణించే ప్రజలు మరియు వాహనాల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే నిర్మించిన అండర్‌బ్రిడ్జ్‌లు వర్షాకాలంలో ఉపయోగించడానికి కష్టంగా మారాయి. నీరు బయటకు వెళ్ళడానికి సరైన పారుదల వ్యవస్థ లేకపోవడం వల్ల ఈ అండర్‌బ్రిడ్జ్‌ల లోపల వర్షపు నీరు నిలిచిపోతోంది. దీని ఫలితంగా, పాదచారులు, ద్విచక్ర వాహనాలు, కార్లు, అంబులెన్సులు మరియు ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది, దీనివల్ల అసౌకర్యం మరియు భద్రతాపరమైన ఆందోళనలు తలెత్తుతున్నాయి. ప్రతి వర్షానికి ఈ అండర్‌బ్రిడ్జ్‌లు నీట మునిగి ఉంటే, వాటిని నిర్మించిన ఉద్దేశ్యం నెరవేరదు. చుట్టుపక్కల గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు మరియు ఈ విషయంపై తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అందువల్ల, మేము మిమ్మల్ని వినయపూర్వకంగా అభ్యర్థించేదేమంటే:అండర్‌బ్రిడ్జ్‌ల లోపల వర్షపు నీరు నిలవకుండా ఉండేందుకు సరైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వర్షపు నీరు నేరుగా లోపలికి రాకుండా తగ్గించడానికి ప్రతికూల వాతావరణ పరిస్థితులలో ప్రయాణికులను రక్షించడానికి అండర్‌బ్రిడ్జ్‌లపై షెడ్ కవర్లను నిర్మించాలి అని కోరారు.

## యువత భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్ సాకారం అవుతోంది



**జయశంకర్ భూపాలపల్లి.** యువత భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్ ఏ2047 సాకారం అవుతుందని జిల్లా రెవెన్యూ అధికారి వసంత కుమారి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం యువత సాధికారత, నాయకత్వ లక్షణాల పెంపొందించడం మరియు సమాజ సేవే ధ్యేయంగా మై భారత్ భూపాలపల్లి కేంద్రం 2026-27 వార్షిక కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంపై మై భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో డిఆర్వో వసంత కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ?కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రూపకల్పన చేసిన ఈ ప్రణాళిక ద్వారా జిల్లా వ్యాప్తంగా యువజన సంఘాలను బలోపేతం చేయడంతో పాటు, వివిధ కార్యక్రమాల ద్వారా యువతలో దేశభక్తి, సామాజిక బాధ్యతను పెంపొందించనున్నట్లు పేర్కొన్నారు. వికసిత్ భారత్ ఏ2047 లక్ష్యంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన, పౌరుల బాధ్యతలను పెంపొందించేందుకు పాన్-ఇండియా పాదయాత్రలు, ?యూత్ క్లబ్ డెవలప్‌మెంట్ క్యాంపెయిన్స్, గ్రామ, బ్లాక్ స్థాయిల్లో యూత్ క్లబ్‌ల డిజిటల్ రిజిస్ట్రేషన్, నూతన నాయకత్వ శిక్షణ.?నషా ముక్త్ భారత్, నషే సే ఆజాదీ నినాదంతో గ్రామాలు, వార్డులలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సులు, ప్రతిజ్ఞా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతీయ సమైక్యత, సాంస్కృతిక మార్పిడి మరియు నాయకత్వ పెంపు కోసం 7 రోజుల జాతీయ స్థాయి క్యాంపులు, పర్యావరణం, ఆరోగ్యం, దేశాభివృద్ధి అంశాలపై ఏటా 25 ముఖ్యమైన దినోత్సవాల నిర్వహణ, డిసెంబర్ 25 సుపరిపాలనా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ కేంద్ర పథకాలపై ప్రత్యేక వర్క్‌షాప్‌లు,?క్రీడా పోటీలు, స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. క్లస్టర్, జిల్లా స్థాయి క్రీడల నిర్వహణతో పాటు క్రియాశీలక యూత్ క్లబ్‌లకు స్పోర్ట్స్ కిట్ల ఉచిత పంపిణీ,?ఇంటర్-స్టేట్, ఇతర రాష్ట్రాల సంస్కృతి, భాష, జీవన విధానాలపై అవగాహనకు 5 రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువతలో లీడర్‌షిప్ స్కిల్స్ పెంచేలా క్యాంప్‌లు మరియు రక్తదానం, పారిశుధ్యం, మొక్కల పెంపకం వంటి రెండు వారాల సేవా కార్యక్రమాలు, స్థానిక అవసరాలకు అనుగుణంగా ఉపాధి, నైపుణ్యాభివృద్ధి మరియు స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాలు నిర్వహణ, ?ప్రజా పాలన, జాతీయ అంశాలపై యువత ఆలోచనలను పంచుకోవడానికి మరియు నాయకులతో చర్చించడానికి ప్రత్యేక వేదికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని యువత మరియు యూత్ క్లబ్‌ల ప్రతినిధులు మై భారత్ (ఓజ ఃష్ట్రజీతీజీబి) పోర్టల్‌లో నమోదు చేసుకుని, ఈ 2026-27 వార్షిక కార్యక్రమాలలో భాగస్వాములై వికసిత్ భారత్ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో జిల్లా యువజన అధికారి భూక్య సంజీవ్, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి చిర్రా రఘు, డీఈఓ రాజేందర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా మధుసూదన్, జిల్లా ఉపాధికల్పన అధికారి ఎం. మల్లయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ బి. నాగరాజు అదనపు డీఆర్‌డీవో బి. సురేందర్, జిల్లా ఎస్సి అభివృద్ధి సంక్షేమ అధికారి కె. సుకీర్తి, ఎన్‌సీసీ అధికారి జి. రాజయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బి. రాజు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి.. సంక్షేమమే కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనకు ప్రతీక..

**నందిగామ:** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు గత పాలకుల వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రజల్లోకి విస్తృతంగా వెళ్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం నందిగామ పట్టణం 17వ వార్డులో కూటమి నేతలతో కలిసి డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. గత పాలకుల హయాంలో అభివృద్ధి పనులు నిర్లక్ష్యానికి గురయ్యాయని, ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని పేర్కొంటూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి సమస్యను ప్రాధాన్యతా క్రమంలో గుర్తించి, ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్న తీరును ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రజలకు వివరించారు. నందిగామ నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్నామని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కూటమి నేతలు తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో నందిగామ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని వారు పేర్కొన్నారు.

## సి.బెలగల్‌లో ఫేక్ ఫోన్‌పే కలకలం

**- నకిలీ చెల్లింపులతో వ్యాపారులకు టోకరా..**

**- అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి**

**సి.బెలగల్,** కర్నూలు జిల్లా సి.బెలగల్ మండల కేంద్రంలో ఫేక్ ఫోన్‌పే చెల్లింపుల పేరుతో కొందరు యువకులు వ్యాపారులను మోసం చేస్తున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. డిజిటల్ చెల్లింపులపై విశ్వాసాన్ని దెబ్బతీసేలా జరిగిన ఈ ఘటనతో స్థానిక వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం, కొందరు యువకులు దుకాణాలకు వెళ్లి వివిధ రకాల సరుకులు కొనుగోలు చేసినట్లు నటిస్తున్నారు. అనంతరం నగదు ఇవ్వకుండా, "ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించాం" అంటూ నకిలీ చెల్లింపు స్క్రీన్ లేదా ఫేక్ ఫోన్‌పే యాప్‌ను చూపించి వ్యాపారులను నమ్మిస్తున్నారు. వ్యాపారులు తమ బ్యాంకు ఖాతాలో నిజంగా నగదు జమ అయిందా లేదా అని పరిశీలించేలోపే అక్కడి నుంచి వెళ్లిపోతున్నట్లు సమాచారం. ఈ తరహా ఘటనలు ఒక్కటి కాదు, పలుచోట్ల జరిగినట్లు వ్యాపార వర్గాలు చర్చించుకుంటున్నాయి. దీంతో ఆన్‌లైన్ చెల్లింపులు స్వీకరించే విషయంలో వ్యాపారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

చాలామంది వ్యాపారులు చెల్లింపు సందేశాన్ని మాత్రమే నమ్మకుండా, తమ బ్యాంకు ఖాతాలో లేదా అధికారిక యాప్‌లో మొత్తం జమ అయినట్లు నిర్ధారించుకున్న తర్వాతే సరుకులు అందజేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చినప్పటికీ, కొందరు వ్యక్తులు మధ్యవర్తులుగా వ్యవహరించి పరస్పర రాజీ కుదిర్చినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు. మండల వ్యాప్తంగా ఇలాంటి మోసాలపై వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. డిజిటల్ చెల్లింపుల సమయంలో కేవలం స్క్రీన్‌షాట్‌లు లేదా చెల్లింపు విజయవంతమైందని చూపించే చిత్రాలను నమ్మకుండా, బ్యాంకు ఖాతాలో డబ్బు జమ అయినట్లు స్వయంగా ధృవీకరించిన తర్వాతే సరుకులు ఇవ్వాలని వ్యాపారులు ఒకరినొకరు హెచ్చరిస్తున్నారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే పూర్తి స్థాయిలో విచారణ జరిపి, నకిలీ చెల్లింపులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ ఘటన మండల వ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది.

## పిడుగురాళ్లలో మండల రెవెన్యూ సదస్సు

**- టిడిపి పట్టణ శాఖ అధ్యక్షుడు పిల్లి చెన్నారావు వెల్లడి**

**పిడుగురాళ్ల,** పిడుగురాళ్ల పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం నందు నేడు (బుధవారం) ఉదయం 10 గంటలకు రాష్ట్ర రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పిడుగురాళ్ల మండల రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తెలుగుదేశం పార్టీ పిడుగురాళ్ల పట్టణ శాఖ అధ్యక్షులు పిల్లి చెన్నారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు హాజరవుతారని చెన్నారావు తెలిపారు. ఈ సందర్భంగా చెన్నారావు మాట్లాడుతూ, పిడుగురాళ్ల మండల పరిధిలోని గ్రామాల నందు దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు, వివాదాల పరిష్కారం కోసం పిడుగురాళ్ల పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం నందు నిర్వహించే ఈ కార్యక్రమంలో పరిష్కారం చూపడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల మండల పరిధిలో ఇప్పటికే నెలకొని ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం ఆయా గ్రామాలలో భూ సమస్యలు ఉన్న యజమానులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి పిడుగురాళ్ల మండల మరియు పట్టణంలోని తెలుగుదేశం, జనసేన మరియు బిజెపి పార్టీల నాయకులు, యువత, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు అందరూ పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

## ఎల్ నినో ప్రభావం

**- ప్రత్యామ్నాయ పంటల సాగు- శాస్త్రవేత్తల బృందం**




**ఆత్మకూరు** ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో ప్రస్తుత వర్షాభావ పరిస్థితులపై అవగాహన సదస్సులు ఆత్మకూరు మండలంలోని నలకాల్వ, కరివెన గ్రామాల్లో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏ.డి.ఆర్. డాక్టర్. జయలక్ష్మి మాట్లాడుతూ వాతావరణ మార్పులకు ప్రతిబింబించే విధంగా ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం ఉందని, ఈ పరిస్థితులలో రైతులు అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులుగా మినుము, కొర్ర, సజ్జ, జొన్న వంటి తక్కువ నీటి అవసరం ఉన్న తక్కువ కాలం పంటలను సాగు చేయాలని సూచించారు. ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్. మంజునాథ్ మాట్లాడుతూ నేల తేమను కాపాడుకోవడానికి మల్చింగ్ పద్ధతులు పాటించాలని, అలాగే సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రొఫెసర్ డాక్టర్. విజయభాస్కర్ బెట్టు పరిస్థితుల్లో పంటకు ఫోలియర్ పోషకాల పిచికారీ ప్రాముఖ్యతను, చీడపీడల నుండి పంటను ఎలా కాపాడుకోవాలో వివరించారు. సైంటిస్ట్ డాక్టర్. ఫరీదా గారు నీటి ఆదా కోసం సాలు మార్చి నీళ్లు పెట్టడం, డ్రిప్ మరియు స్ప్రింక్లర్ పద్ధతులను వినియోగించాలని సూచించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్. జయచంద్ర రెడ్డి ఎల్ నినో ప్రభావం వల్ల నేల సారాన్ని ఎలా కాపాడుకోవాలో వివరించారు. మండల వ్యవసాయ అధికారి హేమలత రైతులందరూ తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని దాని ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఆచార్య ఎన్జీరంగా మహానంది కళాశాల విద్యార్థులు ఎల్ నినో ప్రభావం గురించి నల్ల కాలువ గ్రామంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ.డి.ఆర్. డాక్టర్. జయలక్ష్మి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్. మంజునాథ్, ప్రొఫెసర్ డాక్టర్. విజయభాస్కర్, సైంటిస్ట్ డాక్టర్. ఫరీదా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్. జయచంద్ర రెడ్డి, ఏ.డి.ఏ. హేమలత మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు సతీష్ కుమార్, నాగ ఉమా మహేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు పార్వతి బాయ్, అశోక్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

# అక్కడి డ్రైనేజీ నీరంతా ఆ సెల్లార్ లోకే

**రంగారెడ్డి** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీ లో సిల్వర్ ఓక్స్ అపార్ట్మెంట్ లోకి చుట్టుపక్కల ఉండే డ్రైనేజీ నీరు చేరిన నరకయాతన అనుభవిస్తున్నారు. గత మూడు రోజుల నుండి చుట్టుపక్కల ఉండే భూగర్భ డ్రైనేజీ నీరు అంతా తమ అపార్ట్మెంట్ లోకి చేరి మూడు రోజుల నుంచి కరెంటు, నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. గత 20 రోజులుగా ఈ సమస్య ఉన్న తమను పట్టించుకునే నాధుడు అయ్యారని అన్నారు. ఎల్లమ్మ బండ తులసివనం వెళ్లే మార్గం లో నూతన రోడ్డు నిర్మాణం చేయగా కనీసం అవగాహన లేకుండా వేయడంతో చెరువు వైపు వెళ్లాల్సిన నీరు డ్రైనేజీ మ్యాన్ హోల్ పూర్తిగా మూసివేయడంతో నీరు అంతా వెనకకు చేరి అపార్ట్మెంట్ లోకి వస్తుందని అన్నారు. అధికారులు వస్తున్నారు చూస్తున్నారే తప్ప సమస్య పరిష్కారం కావడం లేదుని అన్నారు. ఇప్పటికే అపార్ట్మెంట్లో ఉన్న అందరూ ఖాళీ చేసి వెళ్లారని వారు వెల్లడించారు

# నడి రోడ్డుపై వ్యక్తిపై హత్యాయత్నం



**హైదరాబాద్** నడి రోడ్డు పై వ్యక్తిని దారుణంగా చంపే ప్రయత్నం చేసారు దుండగులు. సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగరేణి కాలనీలో ఘటన జరిగింది. హమేర్(35) అనే వ్యక్తిపై హత్యయత్నం చేసారు. హమేర్ పై గంజాయి బ్యాచ్ కత్తితో దాడి చేసిందని సమాచారం. స్థానికులు బాధితున్ని హాస్పిటల్ కు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. హమేర్ పై గతంలో పలు చోరీ కేసులు నమోదు అయినట్లు సమాచారం. పాత కక్షలు, ఆర్థిక లావాదేవీలు కారణంగానే దాడి చేసినట్లు సమాచారం.

# స్టైపెండ్ పెంపే డిమాండ్..

**- రాష్ట్రవ్యాప్తంగా ఆయుష్ వైద్యుల నిరవధిక సమ్మె**

స్టైపెండ్ పెంపు డిమాండ్‌తో తెలంగాణలోని ప్రభుత్వ ఆయుష్ వైద్య కళాశాలలు, అనుబంధ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులు మంగళవారం నుంచి నిరవధిక సమ్మె ప్రారంభించారు. హైదరాబాద్ రామంతపూర్‌లోని జేఎస్పీఎస్ ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కాలేజీ మరియు ఆస్పత్రి వద్ద జేఏసీ ఆధ్వర్యంలో వైద్యులు నిరసన చేపట్టి, "వివక్ష వీడాలి.. స్టైపెండ్ పెంచాలి" అంటూ నినాదాలు చేశారు. తెలంగాణలో ఆయుష్ విద్యార్థులకు చెల్లిస్తున్న స్టైపెండ్ దేశంలోనే అత్యల్పమని, గత పదేళ్లుగా ఎలాంటి పెంపు లేదని జేఏసీ ఆరోపించింది. అల్లోపతి విద్యార్థులతో సమానంగా స్టైపెండ్ పెంచాలని, డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేసింది. వైద్యుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రోగులు కోరారు. సమ్మె కొనసాగితే వైద్య సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

## పాము కాటుకు గురైన బాధితురాలును పరామర్శించిన బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ



**బద్వేలు** బద్వేల్ మున్సిపాలిటీ రాజు గారి వీధిలో నివాసం ఉంటున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గౌనిపురం శ్రీనివాస రాజు సతీమణి శ్రీదేవి ఇటీవల ప్రమాదవశాత్తు పాముకాటుకు గురై చికిత్స పొంది ఇంటికి వచ్చిన విషయం తెలుసుకొని వారి యొక్క మంగళవారం స్వగృహానికి వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న బద్వేల్ మాజీ శాసనసభ్యురాలు కే.విజయమ్మ .ఈ కార్యక్రమంలో బద్వేల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు గుర్రం పాటి వెంగళరెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ పార్థసారథి, సత్యమూర్తి రాజు శ్రీరామరాజు,శివయ్య స్వామి,గూడెం వేణు, మితికాయల రమణ, బద్వేల్ మున్సిపాలి జనరల్ సెక్రటరీ, ఆనంద్ ఈగ సుబ్బారెడ్డి, బాలిశెట్టి వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య నరసింహులు గోల్డ్ చెన్నయ్య (మత్స్యశాఖ అధ్యక్షుడు) అలంగీర్, దావూద్ (ఫర్నిచర్ ) అనుగుంది శివకుమార్ రాజేష్ కుమార్ పొన్న రవిరాజు మున్సిపాలిటీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఏరియా వైద్యశాల అభివృద్ధికి చర్యలు

**- ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ**



**నరసరావుపేట,** పల్నాడు జిల్లా నరసరావుపేట ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నరసరావుపేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారన్నారు. ప్రస్తుతం దాదాపు 200 పడకలతో అన్ని విభాగాల్లో సర్జరీలు, ఓపీ సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ నెలలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి పర్యటన ఉన్న నేపథ్యంలో ఆసుపత్రికి అవసరమైన మౌలిక సదుపాయాలపై చర్చించి మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకే హెచ్ డి ఎస్ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాత ఏరియా ఆసుపత్రి భవనాలను తొలగించి అక్కడ తల్లీబిడ్డల ఆరోగ్య సముదాయం నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఇందుకు ఇప్పటికే నాబార్డు ద్వారా రూ.55 కోట్ల నిధులు మంజూరయ్యాయని, మంత్రి పర్యటన తర్వాత నిర్మాణ ప్రణాళికలను ఖరారు చేస్తామన్నారు. అలాగే రోగులకు తాగునీటి సరఫరా, రెస్ట్ రూమ్స్ ఏర్పాటుకు సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. కలెక్టర్ పర్యవేక్షణలో ఈ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ కమిటీ చైర్మన్ లక్కిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, కమిటీ సభ్యులు డాక్టర్ భారతీ దేవి, మిరియాల వెంకట సుబ్బమ్మ, తవ్వా మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## రమణయ్యపేట పంచాయితీ కార్యదర్శి, గుమస్తాపై చర్యలు తీసుకోవాలంటూ పిజిఆరఎస్‌లో పిర్యాదు



**కాకినాడ** రమణయ్యపేట పంచాయితీ పరిదిలో అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలతో పాటు, వ్యాపార సముదాయల స్థానే గృహ సముదాయాలంటూ పన్ను వేసిన పంచాయితీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలంటూ మాజీ ఎంపిటిసి పితాని రాము సోమవారం కాకినాడ జిల్లా కలెక్టర్‌కు పిజిఆరఎస్‌లో పిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే అతి పెద్ద పంచాయితీలలో ఒకటైన రమణయ్యపేట పంచాయితీలో అనేక అక్రమాలు జరిగినా పంచాయితీ కార్యదర్శితో పాటు గుమస్తా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. మండల అభివృద్ది కార్యాలయం పక్కన బహుళ అంతస్తు భవనం నిర్మించి వ్యాపారాలు చేస్తుంటే ఆ భవంతికి గృహసముదాయానికి సంబందించిన పన్ను వేయడం జరిగిందన్నారు. అంతే కాకుండా రమణయ్యపేట మార్కెట్ పరిదిలో ఎటువంటి సెట్‌బ్యాక్‌లు లేకుండా భవనం నిర్మించినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఏపిఎస్పీ క్వార్టర్స్ ప్రధాన రహదారిపై బార్‌షాపుతో పాటు అనుమతులు లేకుండా అనేక నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. దీనిపై కార్యదర్శికి, గుమస్తాకు ఎన్ని సార్లు పిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. దీనివల్ల పంచాయితీ ఆదాయానికి లక్షల రూపాయలు నష్టం వస్తుందన్నారు. ఇప్పటికైనా పంచాయితీలో జరుగుతున్న అక్రమాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి పంచాయితీ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# హైదరాబాద్‌లో భారీగా మసాలా పదార్థాల ఆహార కల్తీ గుట్టురట్టు







**హైదరాబాద్** హైదరాబాద్‌లో హెచ్-ఫాస్ట్ జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు 13 సంస్థల్లో తనిఖీలు నిర్వహించి 25 వేల కిలోల మసాలా దినుసులను స్వాధీనం చేసుకున్నారు. మసాలా దినుసుల్లో సింథటిక్ రంగులు, ఇండస్ట్రియల్ డైలు, టాల్కమ్ పౌడర్, రైస్ బ్రాన్ ఆయిల్ కలిపి రంగు, మెరుపు, బరువు పెంచినట్లు అధికారులు గుర్తించారు. ఇవి క్యాన్సర్‌తో పాటు తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గత 140 రోజుల్లో హెచ్-ఫాస్ట్ 659 తనిఖీలు నిర్వహించి 202 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసింది. దాదాపు 2.46 లక్షల కిలోల అనుమానిత కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో మసాలా దినుసులు, అల్లం-వెల్లుల్లి పేస్ట్, మాంసం, పనీర్, పాల ఉత్పత్తులు, పండ్లు, ఊరగాయలు, టీ పొడి, తాగునీరు ఉన్నాయి.

# కుటుంబాన్ని వేదిస్తూన్న అమీర్‌ను చంపిన యువకుడు

**- ఓ పాత నేరస్తుడు నిత్యం గంజాయి సేవించి ఓ కుటుంబాన్ని వేదించడంతో కత్తి తో నరికి చంపిన 22 ఏండ్ల యువకుడు**

**- సైదాబాద్ పోలీసు స్టేషన్లో ఘటన**

సైదాబాద్ సింగరేణి కాలనీకి చెందిన సుమన్(22) అనే యువకుడు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన అమీర్ అలియాస్ చోర్ అమీర్ (35)తో సుమన్ కి స్నేహం ఏర్పడింది. అమీర్ పాత కేసుల్లో నిందితుడు. సోమవారం ఇద్దరూ మద్యం సేవించి గొడవ పడ్డారు. మంగవారం ఉదయం అమీర్ సుమన్ కుటుంబాన్ని తిట్టడంతో సుమన్ కొబ్బరి బొండాల కత్తి తో నరికి పారిపోయాడు. దింతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తెలంగాణలో తగ్గుతున్న సంతానోత్పత్తి రేటుపై నోవా ఐవీఎఫ్ చర్చ

**హైదరాబాద్** బంజారాహిల్స్ లో నోవా ఐవీఎఫ్ ఫెర్టిలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన "బియాండ్ ఐవీఎఫ్: బిల్డింగ్ ట్రస్ట్, ఎథిక్స్ అండ్ అవేర్నెస్ ఇన్ ఒఖీ" ప్యానెల్ చర్చలో తెలంగాణలో మొత్తం సంతానోత్పత్తి రేటు ప్రతి మహిళకు దాదాపు 1.5 పిల్లలకు పడిపోయిందని, ఇది ఫర్టిలిటీ స్థాయి 2.1 కంటే చాలా తక్కువని నిపుణులు వెల్లడించారు. ఏఆర్టీ చట్టం?2021పై అవగాహన, రిజిస్టర్డ్ ఫెర్టిలిటీ క్లినిక్‌ల ఎంపిక, రోగుల హక్కులు, నైతిక ప్రమాణాలు, ప్రజా విశ్వాసాన్ని బలోపేతం చేసే అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో దాదాపు ప్రతి ఆరు జంటల్లో ఒకరు సంతానలేమి సమస్యతో బాధపడుతున్నారని, ఫెర్టిలిటీని ప్రజారోగ్య చర్చల్లో కీలక అంశంగా చూడాల్సిన అవసరం ఉందని ప్యానెలిస్టులు పేర్కొన్నారు.

## సాంస్కృతిక యాత్రలపై ఆసక్తి

**హైదరాబాద్** హైదరాబాద్ నుంచి ప్రయాణించే వారిలో సాంస్కృతిక యాత్రలపై ఆసక్తి గణనీయంగా పెరుగుతోందని స్కైస్కానర్ విడుదల చేసిన ఇండియా కల్చర్ ట్రావెల్ ఇండెక్స్ బంజారాహిల్స్ లో వెల్లడించింది. ప్రతి ఇద్దరిలో ఒకరు తమ సెలవులను సాంస్కృతిక అనుభవాల చుట్టూ ప్రణాళిక చేసుకుంటుండగా, 80 శాతం మంది ఇటీవలి కాలంలో ఇలాంటి యాత్రలపై ఆసక్తి పెరిగిందని తెలిపారు. ప్రాంతీయ వంటకాలు (56%), పండుగలు, వేడుకలు (54%), ఆధ్యాత్మిక యాత్రలు (51%) ప్రధాన ఆకర్షణలుగా నిలిచాయి. స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని అనుభవించేందుకు యాత్రికులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని స్కైస్కానర్ ప్రతినిధి నీల్ ఘోస్ తెలిపారు.

## ప్రియుడి మోజులో భర్త, అత్త హత్యకు మహిళ కుట్ర

**నిజామాబాద్** మోపాల్ మండలం మదక్పల్లిలో ప్రియుడి మోజులో భర్త, అత్త హత్యకు మహిళ కుట్ర పన్నిన ఘటన బయటపడింది. భార్య సోని వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నారని భర్త, అత్తను చంపేందుకు ప్లాన్ చేసింది. ఇంట్లో వండిన మీల్ మేకర్ కూరలో గడ్డి మందు కలిపి భర్త భూమయ్య, అత్త భూదేవ్వలకు వడ్డించింది. దాంతో బాధితులు భోజనం చేశాక అస్వస్థతకు గురైయారు. స్థానికులు వారిని వెంటనే ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. భర్త, అత్త ఫిర్యాదుతో పోలీసులు నిందితురాలు సోనిని అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు.

# ఆలయ స్థల వివాదంపై రాజకీయాల్లోదు

**- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

బీరప్ప స్థల వివాదంపై రాజకీయాలతో వాస్తవాలు అన్ని పరిశీలించి అందరికి ఆమోదయోగ్యంగా ఉండేవిధంగా ఆలయాన్ని నిర్మించుకునేందుకు స్థల ఏర్పాటు జరుగుతుందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భరోసా ఇచ్చారు. ఫరూక్ నగర్ ప్రాంతానికి చెందిన పలువురు కురువ కులస్తులు, ఇతర గ్రామ ప్రజలు మంగళవారం షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా కలుసుకున్నారు. సీఎస్కే వెంచర్ లో పురాతన బీరప్ప దేవాలయం స్థల వివాదాన్ని ఎమ్మెల్యేకు వివరించారు. సీఎస్కే యాజమాన్యం భూమి తీసుకున్న సమయంలో దానికి బదులుగా దేవాలయానికి భూమి ఇచ్చేందుకు ఒప్పుకున్నారని ఆ తర్వాత బీరప్ప దేవాలయం ఉన్న స్థలాన్ని ప్లాట్లుగా మార్చి గతంలోని విక్రయించారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కేవలం ఒక గుంట పొలం మాత్రమే అక్కడ ఉందని మిగతా స్థలం లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయని ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నాయకులు బీరప్ప, శ్రీశైలం శివ, నక్కలపల్లి మల్లేష్, మహేందర్, మాసి, శ్రీను, శివ, ఎల్లన్ తదితరులు వివరించారు. ప్రస్తుతం అక్కడ కొన్ని నిర్మాణాలను తొలగించడంతో వివాదం మొదలైందని ఎమ్మెల్యే దృష్టి తెచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వారితో మాట్లాడుతూ.. ఆలయాలు ఆత్మగౌరవ్వాలని వాటికి భంగం ఎవరు కలిగించవద్దని తెలిపారు అయితే దాని గురించి పూర్తిస్థాయిలో తనకు అవగాహన లేదని వాస్త విషయాలను పూర్తిగా పరిశీలించి అక్కడ స్థలం ఉంటే తప్పకుండా అది వచ్చేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ఇలాంటి సమయాల్లో రాజకీయాలు చేయవద్దని రాజకీయాలు చేస్తే తాను రానని వాస్తవాలు ఇలా ఉంటే అలా న్యాయం చేద్దామని వారికి అభయం ఇచ్చారు. కొంత సమయం తీసుకుని దానిపై పూర్తిగా విచారించి ఆలయ స్థలం కోసం పూర్తిస్థాయిలో ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వారికి భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ తదితరులు ఉన్నారు

# సింగరేణిని కాపాడందుకు కేంద్రం పార్లమెంట్ లో బిల్లు చెయాలి

**- ఆర్టీసీని ఎన్నికలు జరిగిన వెంటనే ఆర్టీసీని విలీనం చేయాలి**

**హైదరాబాద్** మణుగూరు ఓపెన్ కాస్ట్ -2 సింగరేణి కి దక్కడం మంచి పరిణామం. మణుగూరును కాపాడినందుకి సీఎం, డీసీఎం ధన్యవాదములని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సింగరేణి డీప్ బ్లాక్ ను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడానికి ఎన్నో కుట్రలు జరిగాయి. సింగరేణి ప్రైవేటికరణ అడ్డుకట్ట వేయడానికి సీఎంకు వినతి లెటర్ ఇచ్చి - సీఎంను కలిసి మాట్లాడారు. సింగరేణి నష్టాలను చూపించి ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చేందుకు కుట్రలు ఇంకా జరుగుతున్నాయి. సింగరేణి అభివృద్ధి చేస్తా అని కేసీఆర్ వైఫల్యం అయ్యారు - ఇప్పుడు కేసీఆర్ లెక్క కాకుండా సింగరేణిని అభివృద్ధి చేయాలని అన్నారు. సింగరేణిని కాపాడందుకు కేంద్రం పార్లమెంట్ లో బిల్లు చెయాలి. సింగరేణి పై దూరదృష్టి లేకపోతే తెలంగాణలు నష్టం జరుగుతుంది. సింగరేణి పై బ్లూ ప్రింట్ తయారు చేయాలి కోరుతున్నా. సింగరేణికి ప్రభుత్వం 56వేల కోట్లు అప్పు ఉంది... ప్రభుత్వం ఆ నిదులను విడుదల చేయాలి. సింగరేణిని కాపాడెందుకు మేము ఉద్యమం చెస్తాం - ప్రభుత్వం ఈగోకు పోకుండా సమ్మె పై ప్రభుత్వం చర్చలు సఫలం చేయాలి. శ్రాణావపల్లి, సత్తుపల్లి, ఇల్లందు కోయిగూడెం, సత్తుపల్లి - కోయిగూడెం -2, గుండాల, పెనుబల్లి, గారిమెల్ల పాలెం మైన్ చేయాలి. ఆర్టీసీని ఎన్నికలు జరిగిన వెంటనే ఆర్టీసీని విలీనం చేయాలి.. లేదంటే పోరాటం చెస్తామని అన్నారు.

కాళేశ్వరం బ్యారేజిలపై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలి. పాలన చేసే వాళ్లంతా మేమే మేధావులం అనుకుంటారు. రాజకీయాల కోసం సంబంధం లేకుండా కామెంట్స్ చేస్తారు. ప్రజల సమస్యలను పక్కన పెట్టి, ఫ్యూచర్ సిటీ పై సీఎం పడ్డారు. ఎప్పుడో జరిగే ఫ్యూచర్ సిటిని పక్కన పెట్టి - ప్రజలు - కార్మికుల సమస్యలను తీర్చాలి. అన్ని శాఖల ఫీజుల బకాయిలు - నిదుల బకాయిలు విడుదల చేయాలి. కాళేశ్వరం ప్రాజెక్టను స్టెప్ని టైప్ అదుబాటులో పెట్టుకోవాలి. బీజేపీ కి మొన్న జెన్ - జి, నిన్న బీహార్ ప్రశాంత్ కిషోర్ విజయం పెద్ద దెబ్బ. బీహాన్ లో ప్రశాంత్ కిషోర్ గెలుపు - రాజకీయాల్లో గొప్ప మలుపు. వర్షాకాల సమావేశాలు కనీసం జరపాలని కోరుతున్నానని అన్నారు.

## డీఎంహెచ్ కార్యాలయంలో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు

**హైదరాబాద్** కోఠి లోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ (డీఎంహెచ్) కార్యాలయంలో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారులోని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ మహిళా ఉద్యోగులు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకుని అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ ఉద్యోగుల సంఘం ఛైర్మన్ మామిడి ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పోతురాజుల విన్యాసాలు, డప్పు కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా మహిళా ఉద్యోగులు చక్కటి చీరకట్టుతో పాల్గొని ఉత్సవాలకు ప్రత్యేక శోభ తీసుకొచ్చారు. ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో డీఎంహెచ్ కార్యాలయంలో బోనాల ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు.

# కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**- కురుమ యువ చైతన్య సమితి**

కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కురుమ యువ చైతన్య సమితి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘమ అధ్యక్షుడు వెంకటేష్ కుర్మా మాట్లాడారు. గొల్ల సామాజిక వర్గంతో కలిపి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో తమ సామాజిక వర్గ ప్రజలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కుల గణన సందర్భంగా తమ సామాజిక వర్గ ప్రజలను తక్కువగా చెప్పడంతో తమకు గుర్తింపు లేకుండా పోతుందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే గొల్లలతో కాకుండా తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నెలరోజుల్లోపు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

49రోడ్డు లేక అల్లాడుతున్న నెలకోట

# కమలంపాలం నుండి 6 కి.మీ ప్రయాణం నరకం



**దేవీపట్నం** మండలంలో కమల పాలెం నుండి నేలకోట వరకు రోడ్ మార్గం సరిగా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నరు వాహన దారులు రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు, రాళ్లు ఉండటంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి. వర్షాకాలంలో ఈ దారి పూర్తిగా బురదమయంగా మారుతుంది. పాఠశాల విద్యార్థులు ప్రతిరోజూ బురదలో నడుస్తూ పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించలేక నష్టపోతున్నారు. ప్రభుత్వం పట్టించుకోవడం లేదుకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి గడిచినా ఈ రోడ్డు సమస్యను పరిష్కరించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో నేతలు హామీలు ఇచ్చిరు కానీ రోడ్ పనులు మాత్రం మొదలు పెట్టలేదాన్నారు

# ములుగులో వైద్య, విద్యా రంగాలకు పెద్దపీట

## మంత్రి సీతక్క పలు అభివృద్ధి పనుల ప్రారంభం

- రామప్ప, మేడారంలో కోట్ల రూపాయల పనుల పరిశీలన - గడువులోగా పూర్తి చేయాలని ఆదేశం.
- కస్తూర్బా కొత్త భవనం ప్రారంభం: విద్యార్థులు రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవాలన్న మంత్రి




**ములుగు(ప్రశ్న న్యూస్)** విద్య, వైద్య రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నూతన సదరం శిబిరం, యుడిఐడి భవనం, ఆక్సిజన్ కేంద్రంతో పాటు ఎముకల, స్త్రీ వైద్య, సాధారణ శస్త్ర చికిత్స, ముక్కు-చెవి-గొంతు విభాగాలకు సంబంధించిన నాలుగు శస్త్ర చికిత్స గదులను జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు.మంత్రి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య శాఖ మంత్రి దామోదర నరసింహ ఆదేశాలతో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించామన్నారు. రానున్న రోజుల్లో జిల్లా కేంద్రంలో ప్రత్యేక మూత్రపిండాల శుద్ధి కేంద్రం, మరో ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వైద్య కళాశాల, పరిచర్య కళాశాల భవనాలను త్వరగా పూర్తి చేస్తామన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు.

### రామప్ప, మేడారంలో అభివృద్ధి పనులు.

వెంకటాపూర్ మండలం పాలంపేటలోని రామప్ప దేవాలయం వద్ద ప్రసాద్ పథకం కింద 61.99 కోట్ల రూపాయలతో చేపడుతున్న అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా తాడ్వాయి మండలం మేడారం ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సమ్మక్క భవన్‌లో మహిళా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళల ఉచిత కుట్టు శిక్షణ శిబిరానికి హాజరై ఉచిత కుట్టు యంత్రాలను పంపిణీ చేశారు.

### కస్తూర్బా కొత్త భవనం ప్రారంభం.

వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్‌లో సమగ్ర విద్య ఆధ్వర్యంలో 2 కోట్ల 30 లక్షల రూపాయలతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నూతన భవనం, అదనపు తరగతి గదులు, ప్రయోగశాలను మంత్రి ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, పోటీ ప్రపంచంలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థికి గణక యంత్ర విద్య అవసరమని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా బోధన ఉండాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పరిశీలనకు ప్రత్యేక అధికారులను నియమించామని చెప్పారు.

### ఇతర కార్యక్రమాలు.

ఏటూరునాగారం గిరిజన అభివృద్ధి సంస్థ కార్యాలయంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించి తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సామాజిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రిని పరిశీలించి కాలానుగుణ వ్యాధులు, వైద్య సేవలపై సమీక్షించారు.ములుగులో విద్యుత్ ప్రమాదంలో పశువులు మృతి చెందిన జగ్గన్నపేటకు చెందిన అజ్మీరా అనిల్‌కుమార్, గంధ్రకోట అశోక్, పతిపల్లికి చెందిన సముద్రాల బక్కయ్యలకు ఒక్కొక్కరికి 40,000 రూపాయల చొప్పున ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ నష్టపరిహార చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా అదనపు కలెక్టర్ సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు రేగ కళ్యాణి, మున్సిపల్ అధ్యక్షురాలు చింతనిప్పుల చంద్రకళ, పంచాయతీరాజ్ సంచాలకులు భగవాన్‌రెడ్డి, జిల్లా విద్యా అధికారి సిద్ధార్థరెడ్డి, జిల్లా ఆసుపత్రి వైద్యాధికారి చంద్రశేఖర్ తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తప్పిపోయిన ఉత్తరాఖండ్‌కు చెందిన మహిళను గుర్తించిన పోలీసులు



**కరీంనగర్** ఇరుకుల గ్రామ శివారులో ఒంటరిగా సంచరిస్తున్న ఉత్తరాఖండ్‌కు చెందిన మహిళను కరీంనగర్ రూరల్ పోలీసులు గుర్తించి రక్షించారు. సమాచారం అందుకున్న వెంటనే ఇన్‌స్పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డి సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకుని మహిళను తమ ఆధీనంలోకి తీసుకుని విచారించారు. విచారణలో ఆమె ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన రూపా రాథోర్ (35)గా గుర్తించారు. కుటుంబ కలహాల కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోయి వివిధ వాహనాల్లో ప్రయాణిస్తూ కరీంనగర్ చేరుకున్నట్లు ఆమె తెలిపింది. మహిళ వివరాల ఆధారంగా కుటుంబ సభ్యులను సంప్రదించగా, ఆమె అదృశ్యంపై ఇప్పటికే ఉత్తరాఖండ్‌లో మిస్సింగ్ కేసు నమోదైనట్లు తెలిసింది. ప్రస్తుతం మహిళను భద్రతార్థం కరీంనగర్ శక్తి కేంద్రంలో ఉంచినట్లు, కుటుంబ సభ్యులు లేదా ఉత్తరాఖండ్ పోలీసులు వచ్చిన అనంతరం చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసి వారికి అప్పగిస్తామని ఇన్‌స్పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డి తెలిపారు.

# జత్వానీ కేసు దేశంలోనే అరుదైనది

## - మాజీ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు

**విజయవాడ** నటి కాదంబరి జత్వానీ కేసు దేశంలోనే అరుదైన కేసుగా రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు అభివర్ణించారు. ఎఫ్ఐఆర్ నమోదు కాకముందే అరెస్టులు చేశారని.. అనంతరం తప్పుడు కేసుతో ఛార్జీషీట్ దాఖలు చేశారని ఆరోపించారు. బాధితురాలు ఎలా నిందితురాలిగా మారిందని అయన ' ప్రశ్నించారు. చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని.. సాక్ష్యాలు లేకుండానే ఛార్జీషీట్లు దాఖలు చేస్తున్నారని సీఐడీ దర్యాప్తుపై విమర్శలు గుప్పించారు. జత్వానీ కేసులో జరిగిన పరిణామాలు న్యాయవ్యవస్థ, దర్యాప్తు విధానాలపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని అయన వ్యాఖ్యానించారు.

# గిరిజన ప్రాంతాల్లో వైద్యం విద్యా సేవలను పరిశీలించిన ఎస్టీ లెజిస్లేటివ్ కమిటీ

**రంపచోడవరం** గిరిజన ప్రాంతాల్లో వైద్యం, విద్యా సేవల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఎస్టీ లెజిస్లేటివ్ కమిటీ ఛైర్మన్ మిరియాల శిరీషా దేవి, కమిటీ సభ్యుడు రేగం మత్స్యలింగం మంగళవారం రంపచోడవరంలో పర్యటించారు.ఈ సందర్భంగా స్థానిక ఏరియా ఆసుపత్రి, మాతా-శిశు కేంద్రం, గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహం, గిరిజన బాలుర గురుకుల ఆశ్రమ పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఏరియా ఆసుపత్రిలో ఔట్‌పేషెంట్ విభాగం, దంత వైద్య సేవలు, స్కానింగ్ సెంటర్, ప్రసూతి విభాగాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎన్టీఆర్ వైద్య సేవల కింద అందిస్తున్న వైద్య సేవల అమలుపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఛైర్మన్ మిరియాల శిరీషా దేవి మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన మౌలిక సదుపాయాలు, వైద్య సిబ్బంది, పరికరాల అందుబాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఔట్‌పేషెంట్ సేవలను మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం గిరిజన విద్యార్థులకు కల్పిస్తున్న వసతి, మధ్యాహ్న భోజన పథకం, బోధన విధానాలు, విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాలను పరిశీలించి విద్యా ప్రమాణాల మెరుగుదలకు చర్యలు కొనసాగించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మైనారిటీ డైరెక్టర్ షేక్ సుభాని, ఏపీఐఐసీ డైరెక్టర్ జి. పెద్దిరాజు, జిల్లా క్రీడాశాఖ అధికారులు వి. కృష్ణారావు, కె. పోతురాజు, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి జి. త్రిమూర్తులు, ఏజెన్సీ డీఈవో వై. మల్లేశ్వరరావు, తహసీల్దార్ సిహెచ్. బాలాజీ, డీఎస్‌డీఓ సతీష్ కుమార్, వైద్యాధికారులు సూర్యప్రకాశ్ రావు, సాంబశివరావు, రాహుల్, నీలిమ, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మంథని అభివృద్ధిలో శ్రీధర్ బాబు

- నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు





**మంథని (ప్రశ్న న్యూస్)** మంథని పట్టణంలో నిర్మాణంలో ఉన్న సమీకృత ఆర్డీవో కార్యాలయం, 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, నూతన మున్సిపల్ కార్యాలయ నిర్మాణ పనులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరిశీలించారు.నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి, పనులను నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారుప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారుఅభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.అదే విధంగా మంథని పట్టణంలోని బొక్కలవాగు చెక్‌డ్యాం ఆధునికరణ, కట్ట పై సుందరీకరణ పనులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు భూమిపూజ చేశారు చెక్‌డ్యాంలో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, కట్టపై వాక్‌వే, చిన్నారుల పార్క్, పచ్చదనం వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మంథని పట్టణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వద్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ సహిందర్ రెడ్డి ఎల్లంకి వంశీ తదితర కౌన్సిలర్లు సర్పంచులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

**రాయచోటి, ఆగస్టు 04:** రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులను వేగవంతంగా అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. రామాపురం మండలంలోని ఏకిలపల్లిచిట్లూరు గ్రామంలో రూ.70 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, గ్రామాల సమగ్ర అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సురేందర్ రెడ్డి మండల, గ్రామస్థాయి నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారుఅన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలోని రామాపురం మండలం చిట్లూరు గ్రామంలో నిర్వహించిన 'ఇంటింటికీ టీడీపీ రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి?సంక్షేమం' కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు.ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లిన మంత్రి ,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే గ్రామ ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రజల విశ్వాసమే ప్రభుత్వానికి బలమని, ప్రతి గ్రామం అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేందర్ రెడ్డి కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.చంద్రబాబు పాలనలో గ్రామాలకు మెరుగైన రహదారులు.రూ.30 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటైన సీసీ రోడ్డును ప్రారంభించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రిఎమండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.రామాపురం మండలంలోని పాలన్నగారిపల్లి ? చిట్లూరు గ్రామంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును మంత్రి ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.రాయచోటి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కె ఎఫ్ సి ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు మాట్లాడుతూ, నూతన వ్యాపారాన్ని ప్రారంభించిన ప్రొప్రైటర్స్ ఎర్రపురెడ్డి బ్రహ్మానందరెడ్డి, కలకట లక్ష్మీకర్ రెడ్డి గారికి అభినందనలు తెలియజేస్తూ, వారి వ్యాపారం విజయవంతంగా అభివృద్ధి చెంది ప్రజల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, వ్యాపారవేత్తలు, అభిమానులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.గాలివీడు మండలంలోని అరవీడు గ్రామ పంచాయతీ పరిధిలో జీజీ రోడ్డు నుంచి రెడ్డివారిపల్లి వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో రూ.45 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామస్థాయి నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.రాయచోటి వీరభద్రస్వామి ఆలయంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక పూజలుభద్రకాళి సమేత వీరభద్రస్వామిని సతీసమేతంగా దర్శించుకున్న రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆలయ మర్యాదలతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ఘన స్వాగతంరాయచోటి పట్టణంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయాన్ని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సతీసమేతంగా దర్శించుకుని ప్రత్యేక ఈ సందర్భంగా ఆలయ అర్చకులువేదమంత్రోచ్చారణల మధ్య మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికి, ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు.అనంతరం ఆలయానికి విచ్చేసిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన భక్తులను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆప్యాయంగా పలకరించి, ×వారికి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా భక్తులు మంత్రి గారికి కృతజ్ఞతలు తెలియజేసి ఆనందం వ్యక్తం చేశారు.తదనంతరం మంత్రి స్వామివారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, అభివృద్ధి, ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయ అధికారులు, అర్చకులు మంత్రికి తీర్థప్రసాదాలు అందజేసి స్వామివారి ఆశీర్వచనాలు అందించారు.అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలోని చిన్నమండెం మండలం, పడమటికోన గ్రామం బోరెడ్డిగారి పల్లెలోని తన సొంత నివాసంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖమంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించి నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, వినతులను మంత్రి గారి దృష్టికి తీసుకురాగా, ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా మాట్లాడి సమస్యలను ఓపికగా విన్న మంత్రి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తన బాధ్యత× అని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ×మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీకి అర్హులను పారదర్శకంగా గుర్తించాలి



**కరీంనగర్** డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కోసం లబ్ధిదారుల ఎంపికను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టాలని సూచించారు.మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జమ్మికుంట, హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్లతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ. అర్హులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఒక్కో దరఖాస్తును కనీసం రెండుసార్లు పరిశీలించి, అర్హత ప్రమాణాల ప్రకారమే నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. సరైన కారణం లేకుండా ఏ ఒక్క దరఖాస్తును తిరస్కరించవద్దని సూచించారు. ప్రతి వార్డులో క్షేత్రస్థాయికి వెళ్లి దరఖాస్తుదారుల వివరాలను ప్రత్యక్షంగా పరిశీలించి, పారదర్శకంగా అర్హుల జాబితాను సిద్ధం చేయాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ ప్రక్రియను నిష్పక్షపాతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.సమావేశంలో జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి మాట్లాడుతూ, తమ మున్సిపాలిటీ పరిధిలో అర్హుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ కిషన్ మాట్లాడుతూ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, కార్పొరేషన్ పరిధిలో లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని, మిగిలిన ఇళ్లకు సంబంధించిన దరఖాస్తులను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు వివరించారు.ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నా పర్సనల్ లైఫ్ గురించి మీకేం తెలుసు?

## పుకార్లపై అనుపమ పరమేశ్వరన్ ఘాటు స్పందన




యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ ఇటీవల సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్న సందేశాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తమిళ నటుడు ధృవ్ విక్రమ్‌తో ప్రేమాయణం ముగిసిందని, ఆ బ్రేకప్ బాధలోనే ఆవేదనతో కూడిన పోస్టులు పెడుతోందంటూ నెట్టింట పుకార్లు వైరల్ అయ్యాయి. ఈ వార్తలపై తాజాగా ఒక ఇంటర్వ్యూలో స్పందించిన అనుపమ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. "నా అధికారిక సోషల్ మీడియా ఖాతాలో ఏం పోస్ట్ చేయాలనేది పూర్తిగా నా వ్యక్తిగత హక్కు, నా సొంత నిర్ణయం. నా బాధను ఇతరుల ముందు ప్రదర్శించి సానుభూతి పొందాల్సిన అవసరం నాకు లేదు. ఒక సాధారణ మహిళగా జీవితంలో ఎదుర్కొనే మార్పుల గురించే నేను మాట్లాడాను. ఆ మార్పులను సమాజంతో ధైర్యంగా పంచుకోవడం నాకు గర్వంగా అనిపిస్తోంది. నా జీవితం, నా పర్సనల్ లైఫ్ గురించి బయట ఉన్న మీకేం తెలుసు? ఇది నా ఇన్‌స్టాగ్రామ్, నాకు నచ్చినవి నేను పోస్ట్ చేసుకుంటాను. నన్ను ప్రశ్నించడానికి మీరెవరు?" అంటూ ఆమె ఘాటుగా సమాధానమిచ్చింది. మరోవైపు రొటీన్ కథలకు భిన్నమైన ప్రాజెక్టులను ఎంచుకుంటున్న అనుపమ, ప్రస్తుతం 'క్రేజీ కల్యాణం' అనే చిత్రంలో నటిస్తోంది. దర్శకుడు బద్రప్ప సారథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో తరుణ్ భాస్కర్, నరేశ్, అఖిల్ ఉడ్డెమారి కీలక పాత్రలు పోషిస్తున్నారు. పర్సనల్ లైఫ్‌పై వచ్చిన వదంతులకు సూటిగా చెక్ పెట్టిన అనుపమ వ్యాఖ్యలు ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.

# పూజా హెగ్డే కొత్త టాలెంట్..

## 'లా లా ల్యాండ్' ట్యూన్‌తో అదరగొట్టిన బుట్టబొమ్మ!



స్టార్ హీరోయిన్, బుట్టబొమ్మ పూజా హెగ్డే సోషల్ మీడియాలో మరోసారి తన అభిమానులను ఆకట్టుకున్నారు. తనలో దాగివున్న సంగీత ప్రతిభను బయటపెడుతూ, ప్రముఖ హాలీవుడ్ చిత్రం 'లా లా ల్యాండ్'లోని థీమ్ సాంగ్‌ను కీబోర్డ్‌పై ప్లే చేస్తున్న వీడియోను సోమవారం తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. ఈ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. "గత కొన్ని రోజులుగా ఈ ట్యూన్ నన్ను వెంటాడుతోంది. దీన్ని ఎలా ప్లే చేయాలో కచ్చితంగా నేర్చుకోవాలనుకున్నాను. ఇక ఇప్పుడు ర్యాన్ గోస్లింగ్ మ్యాజికల్‌గా ప్రత్యక్షమవ్వడమే తరువాయి" అంటూ ఆమె సరదాగా క్యాప్షన్ జోడించారు. ఈ పోస్ట్‌తో పూజాలోని కొత్త కోణాన్ని చూసి అభిమానులు ముగ్ధులవుతున్నారు. ఇదిలా ఉండగా, ఇటీవలే పూజా హెగ్డే తన హెయిర్‌స్టైల్‌ను పూర్తిగా మార్చేసి అభిమానులను ఆశ్చర్యపరిచారు. పొడవాటి జుట్టుకు వీడ్కోలు పలికి, షార్ట్ హెయిర్‌తో సరికొత్త లుక్‌లోకి మారారు. "ఇకపై నేను షార్ట్ హెయిర్ అమ్మాయిని" అంటూ తన కొత్త హెయిర్‌స్టైల్ వీడియోను పంచుకోగా, నెటిజన్ల నుంచి విశేష స్పందన లభించింది. "షార్ట్ హెయిర్ అయినా, లాంగ్ హెయిర్ అయినా నువ్వు ఎప్పుడూ అందంగానే ఉంటావు" "చాలా అందమైన లుక్" అంటూ ఫ్యాన్స్ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. సోషల్ మీడియాలో ఎప్పుడూ చురుకుగా ఉండే పూజా, అంతకుముందు తన వర్కౌట్ సెషన్‌కు సంబంధించిన వీడియోను కూడా పంచుకున్నారు. ట్రెడ్‌మిల్‌పై వెనక్కి నడుస్తూ స్టైల్‌గా వర్కౌట్ చేస్తున్న వీడియో అభిమానులను ఆకట్టుకుంది. ఆరెంజ్ కలర్ క్రాప్ టాప్, మ్యాచింగ్ షార్ట్స్‌లో ఆమె ఫిట్‌నెస్ స్ఫూర్తిని చాటారు. ఇక సినిమాల విషయానికొస్తే, పూజా హెగ్డే చివరిగా 'జన నాయగన్' చిత్రంలో కనిపించారు. ప్రస్తుతం ఆమె వరుణ్ ధావన్, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రలలో డేవిడ్ ధావన్ దర్శకత్వంలో వస్తున్న రొమాంటిక్ కామెడీ 'హై జవానీ తో ఇష్క్ హోనా హై'లో కథానాయికగా నటిస్తున్నారు. తన వ్యక్తిగత, వృత్తిపరమైన అప్‌డేట్స్‌తో పూజా నిరంతరం అభిమానులకు టచ్‌లో ఉంటున్నారు.



## కాలి గాయంపై స్పందించిన

# హీరోయిన్ రశ్మిక మందన్న

ఇటీవల మైసా సినిమాలో డ్యాన్స్ సీక్వెన్స్ చిత్రీకరిస్తుండగా తీవ్రంగా గాయపడింది హీరోయిన్ రశ్మిక మందన్న. ఆమె 6 వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. వైద్యుల సూచన మేరకు రశ్మిక బెడ్ రెస్ట్ తీసుకుంటున్నారు. ఆమె తాజాగా తన కాలి గాయంపై స్పందించారు. ఇన్ స్టా వేదికగా పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్ లో రశ్మిక మందన్న స్పందిస్తూ - గాయాలు అవ్వడం నాకు చాలా చిరాకు తెప్పిస్తుంది. ఈ గాయం గురించి ఎవరికి తెలియకూడదు అనుకున్నా కానీ తెలిసిపోయింది. నాకు ఇలాంటి గాయం కావడం ఇది మూడవసారి. తుంటికి కాలుని కలిపే టెండన్స్ ఒక్కో వైపు నాలుగు ఉంటాయి. నా కుడి తుంటిలోని ఒక టెండెన్ ఊడిపోయింది. నేను కాలు పైకి ఎత్తాలి అంటే అది మళ్లీ అతుక్కోవాలి. మైసా సినిమా కోసం డాన్స్ షూట్ చేస్తున్నప్పుడు ఈ ప్రమాదం జరిగింది. నేను చేస్తున్న సినిమాల్లో మైసా అత్యంత కష్టమైన సినిమా. నేను విశ్రాంతి తీసుకోవడానికే దేవుడు ఈ గాయం బారిన పడేలా చేశాడని భావిస్తున్నాను. అని అన్నారు. ప్రస్తుతం రశ్మిక రణబాలి, మైసా సినిమా షూటింగ్స్ లో పాల్గొంటున్నారు. వీటితో పాటు మరో రెండు భారీ చిత్రాల్లో నటిస్తున్నారు. అలాగే 30 ప్రాడక్ట్స్ కు బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరిస్తున్నారు. రశ్మికకు అయిన తీవ్ర గాయంతో ఆయా సినిమాల, వ్యాపార ప్రకటనల షూటింగ్స్ నిలిచిపోయాయి.

# అమ్మతో దాపరికం నాన్నతో రాచరికం



అగ్ర కథానాయకుడు రవితేజ 'ఇరుముడి' చిత్రం ఈ నెల 21న విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమా ప్రచారంలో మేకర్స్ వేగం పెంచారు. మ్యూజిక్ ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమా నుంచి రెండవ పాట 'యాలో యాలాలో ఎన్నెట్లో ఎన్నెన్ని ముచ్చట్లో.. అమ్మతో దాపరికం.. నాన్నతో రాచరికం.. మా ఇంటి ప్రేమరికం చూడాలి ఈ లోకం..' అంటూ సాగే ఈ పాటను అనంతశ్రీరామ్ రాయగా జీవీ ప్రకాశ్‌కుమార్ స్వరపరిచారు. హెషమ్ అబ్దుల్ వహాబ్, సాధికా కేఆర్ కలిసి ఆలపించారు. మధ్య తరగతి కుటుంబంలోని ప్రేమ, అనుబంధాలు, ఆప్యాయతలే అసలైన సంపద అనే భావాన్ని తెలియజేస్తూ ఈ పాట సాహిత్యం సాగింది. కుటుంబాన్ని అమితంగా ప్రేమించే ఆటోడ్రైవర్‌గా ఇందులో రవితేజ నటిస్తున్నట్టు ఈ పాట తెలియజెపుతున్నది. ప్రియ భవానీశంకర్, బేబీ నక్షత్ర తమ సహజమైన నటనతో పాత్రలకు అందాన్ని తెచ్చారు. ఈ గీతానికి చిత్ర దర్శకుడు శివ నిర్వాణ కొరియోగ్రఫీ అందించడం విశేషం. సాయికుమార్, అజయ్ ఘోష్, రమేశ్ ఇందిర, స్వాసిక, మీసాల లక్ష్మణ్, రాజ్‌కుమార్ కసిరెడ్డి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: విష్ణు శర్మ, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, నిర్మాణం: మైత్రీ మూవీమేకర్స్.

## హక్కుల రక్షణ కోసం బాంబే హైకోర్టును

# ఆశ్రయించిన శ్రుతి హాసన్



ప్రముఖ నటి శ్రుతి హాసన్ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. తన పర్సనాలిటీ, పబ్లిసిటీ హక్కుల పరిరక్షణను కోరుతూ బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

తన అనుమతి లేకుండా తన పేరు, ముఖాన్ని వాడుతున్న వ్యాపార సంస్థలు, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు, ఏఐ డీప్‌ఫేక్ క్రియేటర్లపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం, హక్కుల ఉల్లంఘనపై వాణిజ్య దావా దాఖలు చేసేందుకు శ్రుతి హాసన్‌కు అనుమతినిచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ద్వారా తన రూపంతో అశ్లీల చిత్రాలు, మార్ఫింగ్ వీడియోలు తయారుచేస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఈ-కామర్స్ సైట్లు, బుకింగ్ యాప్‌లలో తన పేరు, బొమ్మలను వాణిజ్య ప్రచారాలకు వాడుకుంటున్నారని తెలిపారు. గతంలో అమితాబ్ బచ్చన్, అనిల్ కపూర్, కమల్ హాసన్ వంటి ప్రముఖులు కూడా ఇలాంటి రక్షణ ఉత్తర్వులు పొందారు.

# 'ఉయిర్' మూవీ రివ్యూ!

మలయాళం నుంచి ఒక ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ వస్తుందంటే, ఆడియన్స్ ఎంతో ఆసక్తిని చూపిస్తూ ఉంటారు. అలాంటి ప్రేక్షకులలో మరింత కుతూహలాన్ని రేకెత్తించిన సినిమా 'ఉయిర్'. జూన్ 26వ తేదీన థియేటర్లలో ఈ సినిమా విడుదలైంది. రోషన్ మాథ్యూ ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సినిమాకి, పద్మకుమార్ దర్శకత్వం వహించాడు. అలాంటి ఈ సినిమా ఈ రోజు (ఆగస్టు 4) నుంచి 'జియో హాట్ స్టార్'లో స్ట్రీమింగ్ అవుతోంది. మలయాళంతో పాటు తెలుగు .. తమిళ .. కన్నడ .. హిందీ భాషల్లో అందుబాటులోకి వచ్చింది. 'కన్నూర్' జిల్లా పరిధిలోని 'ధర్మడం' పోలీస్ స్టేషన్ కి ప్రొబేషనరీ పోలీస్ సబ్ ఇన్ స్పెక్టర్ గా అజీబ్ ( రోషన్ మాథ్యూ) బాధ్యతలు చేపడతాడు. అతని పైఅధికారిగా 'నందకుమార్' ఉండగా, సహచరులుగా 'జాయ్'.. మోహన్ .. మధు ఉంటారు. అక్కడికి సమీపంలోని 'కొడువల్లి' విలేజ్ లో ఒక బావిలో స్త్రీ డెడ్ బాడీ ఉందనే సమాచారం అందుతుంది. దాంతో అజీబ్ బృందం అక్కడికి చేరుకుంటుంది. పాడుబడిన బావిలో నుంచి ఆ డెడ్ బాడీని బయటికి తీయిస్తారు. ఆమె చనిపోయి కొన్ని రోజులు అయ్యుంటుందని భావిస్తారు. ఆ యువతి పేరు 'శోభ' అనీ, ఆమెకి ఇద్దరు పిల్లలు ఉన్నారని అజీబ్ తెలుసుకుంటాడు. ఆమె చేతిపై 'రాజు' అనే పచ్చబొట్టు ఉంటుంది. అది ఆమె భర్త పేరు అనే విషయం కూడా అజీబ్ ఇన్వెస్టిగేషన్ లో తేలుతుంది. ఆ ఇంట్లో వాళ్లకి శోభ ఫ్యామిలీ ఫొటో దొరుకుతుంది. ఆ ఫొటో ఆధారంగా వాళ్లు రాజును గుర్తుపడతారు. అతని కోసం గాలించి పట్టుకుంటారు. తన భార్య తన స్నేహితుడితో అక్రమ సంబంధం పెట్టుకుందనీ, అది భరించలేక తాను పిల్లలను తీసుకుని వెళ్లిపోయానని 'రాజు' చెబుతాడు. ఆ తరువాత ఏం జరిగిందనేది తనకి తెలియదని అంటాడు. శోభతో కొంతకాలంగా తనకి ఎలాంటి సంబంధం లేదని పోలీసులతో రాజు తేల్చి చెబుతాడు. శవాన్ని తీసుకు వెళ్లనని అతను చెప్పడంతో, పంపించివేస్తారు. ఆత్మహత్యగా భావించి శోభ అంత్యక్రియలు పూర్తి చేస్తారు. ఆ తరువాత శోభ బంధువులు కొందరు స్టేషన్ కి వస్తారు. రాజుతో చెప్పిన తరువాతనే శోభ అంత్యక్రియలు పూర్తి చేశామని అజీబ్ వాళ్లతో చెబుతాడు. ఆ సమయంలో ఆ ఫొటో చూసినవాళ్లు, ఆ ఫొటోలో ఉన్నది రాజు కాదనీ .. అతని పేరు 'భువనేశ్' అని చెబుతారు. అతను ఆమె భర్త కాదని అంటారు. రాజు పేరుతో భువనేశ్ తమని తప్పుదారి పట్టించాడనే విషయం అజీబ్ కి అర్థమవుతుంది. ఇది ఆత్మహత్య కాదు .. హత్య అనే విషయం స్పష్టమవుతుంది. భువనేశ్ ఎక్కడ ఉన్నా 24 గంటలలో పట్టుకోవాలని పైఅధికారులు అజీబ్ ను ఆదేశిస్తారు. అప్పుడు అతను ఏం చేస్తాడు? భువనేశ్ ను అతను పట్టుకోగలుగుతాడా? శోభ మరణానికి భువనేశ్ కారకుడా ? ఆమె భర్త - పిల్లలు ఏమయ్యారు? అనే ఆసక్తికరమైన అంశాలను కలుపుకుంటూ సాగే కథ ఇది. పోలీస్ అధికారులకు తమ కెరియర్లో కొన్ని చిత్రమైన కేసులు ఎదురవుతూ ఉంటాయి. అలా ఒక పోలీస్ ఆఫీసర్ కి తన కెరియర్లో ఎదురైన కేసు ఇది. యథార్థ సంఘటన ఆధారంగా రూపొందిన సినిమా ఇది. అందువలన దర్శకుడు సహజత్వానికి దగ్గరగా ఈ సినిమాను నడిపించడానికి తనవంతు ప్రయత్నం చేశాడు. పాడుబడిన ఒక బావిలో నుంచి ఒక మహిళ శవం బయటపడుతుంది. ఆమె ఎవరు? ఎలా చనిపోయింది? అనే ఇన్వెస్టిగేషన్ తో ఈ కథ మొదలవుతుంది. కొన్ని కేసులు పోలీసులకు సవాళ్లు విసురుతుంటాయి. జరిగింది హత్యనా? ఆత్మహత్యనా? అనేది కొన్ని సందర్భాలలో వాళ్లు తేల్చుకోలేని పరిస్థితి తలెత్తుతూ ఉంటుంది. అలా ఆత్మహత్య అనుకుని ఒక బాడీకి అంత్య క్రియలు జరిపించిన తరువాత, అది హత్య అని తెలిస్తే ఎలా ఉంటుంది? అప్పుడు ఆ పోలీస్ ఆఫీసర్ ఏం చేస్తాడు? ఎలాంటి అవాంతరాలను దాటుకుంటూ వెళతాడు? అనే అంశం చుట్టూ దర్శకుడు ఈ కథను పరిగెత్తించిన తీరు ఆకట్టుకుంటుంది. హత్య జరిగిన తీరు .. దారితీసిన పరిస్థితులు .. అందుకు సంబంధించిన ఆధారాలను అజీబ్ సేకరించిన విధానం ఆడియన్స్ లో ఉత్కంఠను రేకెత్తిస్తుంది. హీరో ఈ కేసును పర్సనల్ గా తీసుకోవడానికి ఒక కారణం ఉంటుంది. అందుకు



సంబంధించిన ఫ్లాష్ బ్యాక్ కూడా ఎమోషనల్ గా కనెక్ట్ అవుతుంది. మొదటి నుంచి చివరివరకూ కూడా, నెక్స్ట్ ఏం జరుగనుందా? అనే ఒక ఆత్రుతను కలిగిస్తూ వెళుతుంది. యథార్థ సంఘటన కావడం వలన, సహజత్వం దెబ్బతినకుండా చూసుకోవడంలో దర్శకుడు మంచి మార్కులు కొట్టేశాడు. ప్రతి పాత్రను మలిచిన తీరు .. ప్రతి సన్నివేశాన్ని ఆవిష్కరించిన విధానం గొప్పగా అనిపిస్తాయి. అటు క్రైమ్ కి సంబంధించిన ఎపిసోడ్స్ గానీ .. ఇటు ఇన్వెస్టిగేషన్ కి సంబంధించిన ఎపిసోడ్స్ గానీ చాలా ఇంట్రెస్టింగ్ గా సాగుతాయి.

## ఎంఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్ విస్తరణ

# వెంటనే నిలిపివేయాలి

**- కంపెనీని శాశ్వతంగా తొలగించాలి: వంటేరు ప్రతాప్ రెడ్డి**



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** మెదక్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం.. రంగాయిపల్లి, చెట్ల గౌరారం గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని డిమాండ్‌గజ్వేల్: మనోహరాబాద్ మండలంలోని రంగాయిపల్లి, చెట్ల గౌరారం గ్రామాల ప్రజలకు మద్దతుగా గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి మెదక్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎంఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్ కంపెనీ విస్తరణను తక్షణమే నిలిపివేసి, కంపెనీని శాశ్వతంగా తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.విషపూరిత వాయు, జల, శబ్ద కాలుష్యంతో స్థానిక ప్రజలు గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీలు, చర్మవ్యాధులు, క్యాన్సర్ వంటి తీవ్ర ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని, పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.కంపెనీ నుంచి విడుదలయ్యే కలుషిత నీటిని తాగిన పశువులు మృత్యువాత పడుతున్నాయని, చెరువులు, కుంటల్లోకి చేరుతున్న వ్యర్థాలతో చేపలు చనిపోతున్నాయని, భూగర్భ జలాలు కలుషితమై రైతులు పంటలు సాగు చేయలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.అంతేకాకుండా, కంపెనీ శబ్ద కాలుష్యం వల్ల విద్యార్థులు చదువుపై దృష్టి సారించలేక వారి భవిష్యత్తు దెబ్బతింటోందని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలు భయాందోళనల మధ్య జీవిస్తున్నారని, మహిళల ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడుతోందని ఆరోపించారు.రంగాయిపల్లి, చెట్ల గౌరారం గ్రామాల శివార్లలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి, ప్రజల అభీష్టానికి అనుగుణంగా ఎంఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్ విస్తరణను రద్దు చేసి, కంపెనీని శాశ్వతంగా తొలగించాలని జిల్లా కలెక్టర్‌ను వంటేరు ప్రతాప్ రెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల ప్రజలు, స్థానిక నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**- ఏడుగురు పై కేసు నమోదు**




ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) గొల్లపల్లి గ్రామంలోని ఓ ఇంటిలో పేకాట (జూదం) నిర్వహిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం రాత్రి సుమారు 12.00 గంటలకు హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడి నిర్వహించారు.దాడి సమయంలో ఏడుగురు వ్యక్తులు ప్లేయింగ్ కార్డులతో జూదం ఆడుతూ ఉండగా వారిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి ప్లేయింగ్ కార్డులు మరియు నగదు రూ.4,050/- స్వాధీనం చేసుకున్నారు.నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు.

## ఆగస్టు 6న తెలంగాణ రక్షణ సేన
## 'సంకల్ప సభ' విజయవంతం చేయాలి

**- సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియానికి గజ్వేల్ నుంచి 1000 మంది కార్యకర్తల తరలింపు**

**- కొట్టాల యాదగిరి ముదిరాజ్**



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** సామాజిక న్యాయం, బడుగు--బలహీన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన ఈ నెల ఆగస్టు 6న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న లిలి"సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ"లిలిను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది, గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి కొట్టాల యాదగిరి ముదిరాజ్ పిలుపునిచ్చారు.

మంగళవారం గజ్వేల్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, గజ్వేల్ నియోజకవర్గం నుంచి 1000 మంది ముఖ్య కార్యకర్తలతో సభకు భారీగా తరలివెళ్తామని తెలిపారు. సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా, ఆయన ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఈ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.తెలంగాణ ఉద్యమం ఆశించిన సామాజిక న్యాయం ఇంకా పూర్తిస్థాయిలో అమలు కాలేదని పేర్కొన్న ఆయన, వెనుకబడిన వర్గాలు, బీసీలు, బడుగు బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో ఈ సభ నిర్వహిస్తున్నామని వివరించారు. రాష్ట్ర జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు రాజ్యాధికారంలో సముచిత వాటా కల్పించాల్సిన అవసరాన్ని ఈ సభ బలంగా వినిపిస్తుందని అన్నారు.ప్రజలకు జరుగుతున్న అన్యాయాలపై ప్రభుత్వ దృష్టిని ఆకర్షిస్తూ, సామాజిక న్యాయం అమలు దిశగా ప్రజాభిప్రాయాన్ని బలంగా చాటిచెప్పే వేదికగా ఈ సంకల్ప సభ నిలుస్తుందని తెలిపారు.ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఎడ్ల నర్సింలు, శ్రీకాంత్, స్వామి, అమర్ సింగ్, చందు, ప్రసాద్, కుమార్, వెంకటేష్, అశోక్, రాజేష్, కిషన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణ మార్పులను ఎదుర్కొనే సాగుపై

# రైతులకు ప్రత్యేక శిక్షణ

**- ముల్కనూరులో కూరగాయల రైతులకు ఆధునిక సాగు సాంకేతికతలపై అవగాహన**

**- ప్రత్యక్ష క్షేత్ర ప్రదర్శనతో శాస్త్రవేత్తల సూచనలు**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) వాతావరణ మార్పుల సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటూ కూరగాయల దిగుబడిని పెంచే ఆధునిక సాగు పద్ధతులపై ముల్కనూరు ప్రాంత రైతులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, ములుగు, సిద్ధిపేటలోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్ ఆధ్వర్యంలో, ముల్కనూరు కో–ఆపరేటివ్ రూరల్ క్రెడిట్ అండ్ మార్కెటింగ్ సొసైటీ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది.ప్రొఫెసర్ డా. వి. సుచిత్ర స్వాగతం పలకగా, అసిస్టెంట్ ప్రొఫెసర్ బి. చంద్రశేఖర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో కూరగాయల సాగులో అనుసరించాల్సిన ఆధునిక సాంకేతికతలు, నాణ్యమైన నారుమడి తయారీ, కోత అనంతర నిర్వహణ, పురుగులు--తెగుళ్ల నివారణ, సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు నిపుణులు సమగ్ర అవగాహన కల్పించారు.వెజిటబుల్ రీసెర్చ్ స్టేషన్, రాజేంద్రనగర్‌కు చెందిన శాస్త్రవేత్త డా. జె. శ్రీనివాస్ ఎల్‌నినో పరిస్థితుల్లో వాతావరణ అనుకూల కూరగాయల సాగు పద్ధతులను వివరించగా, పరిశోధకులు శ్రీమతి కె. నిరోష నాణ్యమైన నారుమడి తయారీ, శ్రీమతి ఎ.వి.ఎన్. లావణ్య కోత అనంతర నిర్వహణపై శిక్షణ అందించారు. డా. వి. సురేష్ కూరగాయల పంటల్లో పురుగులు, వ్యాధుల గుర్తింపు, నివారణ చర్యలపై రైతులకు సూచనలు చేశారు.అనంతరం రైతులను ఉద్యాన విశ్వవిద్యాలయం దత్తత గ్రామమైన క్షీరసాగర్కు తీసుకెళ్లి, గ్రామ సర్పంచ్ కొన్యాల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్షేత్ర ప్రదర్శనలో వాతావరణ అనుకూల సాగు పద్ధతులను ప్రత్యక్షంగా చూపించారు. శాస్త్రవేత్తలతో రైతులు ముఖాముఖి చర్చించి తమ సందేహాలకు నివృత్తి పొందారు.శిక్షణ ముగింపులో రైతుల అభిప్రాయాలను స్వీకరించిన అధికారులు, ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ శిక్షణ తమకు ఎంతో ప్రయోజనకరంగా ఉందని రైతులు పేర్కొంటూ విశ్వవిద్యాలయానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఏటూరునాగారం అభివృద్ధికి నిధులు కావాలి

**- మంత్రి సీతక్కకు సర్పంచ్ వినతి.**

**- పారిశుద్ధ్యం, తాగునీటి కోసం 2 ట్రాక్టర్లు, 30 మంది సిబ్బంది కోరిన సర్పంచ్ శ్రీలత.**

**- ఆదర్శ గ్రామంగా ఏటూరునాగారం: సీతక్క సహకారం కోరిన సర్పంచ్.**



**ఏటూరునాగారం(ప్రశ్న న్యూస్)** ఏటూరునాగారం గ్రామ అభివృద్ధి, పారిశుద్ధ్య మెరుగుదల, తాగునీటి సరఫరా వసతుల కల్పనకు తక్షణ నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గౌ. అనసూయ సీతక్క గారిని గ్రామ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత కోరారు.మంగళవారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేసిన అనంతరం సర్పంచ్ మాట్లాడారు. ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో జనాభా పెరుగుతోందని, దీనికి అనుగుణంగా మౌలిక వసతులు, పారిశుద్ధ్య నిర్వహణను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.చెత్త సేకరణ వాహనాలు ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణకు 2 కొత్త ట్రాక్టర్లు, ట్రాలీలతో సహా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ నిధులు మంజూరు చేయాలి.సిబ్బంది నియామకం తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఇతర అత్యవసర సేవల కోసం అదనంగా 30 మంది పీఆఔ మల్టీ పర్పస్ వర్కర్స్‌ను నియమించేందుకు అనుమతి ఇవ్వాలి.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీరంగవరం ప్రాథమిక
# ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ శ్రీరంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి ఆరోగ్య సేవల అమలు తీరును సమీక్షించారు.ఈ సందర్శన సందర్భంగా జాతీయ ఆరోగ్య మిషన్ మార్గదర్శకాల ప్రకారం ఔట్ పేషెంట్ సేవలు, గర్భిణీ స్త్రీలు శిశు ఆరోగ్య సేవలు, టీకాల కార్యక్రమం, ఔషధ నిల్వలు, ల్యాబొరేటరీ సేవలు, రికార్డుల నిర్వహణ, హాజరు పట్టికలు, శుభ్రత, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, ఫార్మసీ, ఆరోగ్య కేంద్ర మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవల నాణ్యతపై ఆరా తీసి, మరింత మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బందికి పలు సూచనలు చేశారు.అనంతరం వైద్యాధికారి ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఎదురవుతున్న కొన్ని పరిపాలనా, మౌలిక సదుపాయాల సంబంధిత అంశాలను వైద్యాధికారి డా. కె. ఆనంద్ దృష్టికి తీసుకువెళ్లారు. వాటిని శ్రద్ధగా విన్న ఆయన, సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గతంలో ఇదే శ్రీరంగవరం పీహెచ్‌సీలో వైద్యాధికారిగా సేవలందించిన డా. కె. ఆనంద్, నేడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా తిరిగి తమ కేంద్రాన్ని సందర్శించడం తమకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఆయన సేవా దృక్పథం, సిబ్బందితో కలిసిమెలిసి పనిచేసే తీరును గుర్తుచేసుకుంటూ సంతోషం వ్యక్తం చేశారు.డా. ఆనంద్ కూడా తనకు శ్రీరంగవరం పీహెచ్‌సీతో ప్రత్యేక అనుబంధం ఉందని పేర్కొంటూ, ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

## శ్రీకాళహస్తిలో ఇంటింటికి


# తెలుగుదేశం కరపత్రాలు పంపిణీ



**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సూచనల మేరకు శ్రీకాళహస్తి పట్టణమునందు ఈరోజు 25 వార్డు యందు ఇంటింటికి తెలుగుదేశంకార్యక్రమం నిర్వహించడం జరిగినది ఈ సందర్భంగా ప్రతి ఇంటిని సందర్శించి కరపత్రాలు పంపిణీ చేసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఈ రెండు సంవత్సరాలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమం,ఉద్యోగ ఉపాధి అవకాశాలను ప్రజలకు వివరించడం జరిగినది అలాగే వార్డుల యందు సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా శాసనసభ్యులు వారికి తెలియపరచి చర్యలు తీసుకుంటామని తెలియజేయడం జరిగినది ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి పట్టణ టిడిపి అధ్యక్షులు జి విజయకుమార్ క్లస్టర్ ఇంచార్జ్ కంఠ రమేష్ యూనిట్ ఇంచార్జ్ హేమంత్ కుమార్ కిట్టు దేవస్థానం పాలకమండలి సభ్యులు గుర్రప్ప శెట్టి , పార్టీ నాయకులు అశోక్, అభి, వెంకీ లు పాల్గొనడం జరిగినది.

## తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులకు సత్వర లబ్ది.

**- సమకూరేల చర్యలు చేపట్టండి.... - కొండేలమారుతి...**




**మంథని (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ఏర్పటులోఅహర్నిశలు శ్రమించిన ఉద్యమకారులకు సంక్షేమ పథకాల ను చేరేలా ముఖ్యమంత్రి.. కాంగ్రెస్ పార్టీ మానిఫెస్టో చైర్మన్ లకు వర్ధిల్లు తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు కొండేల మారుతీ కోరారు...మంగళవారం నాడిక్కడ జరిగిన వర్ధిల్లు తెలంగాణ ఉద్యమ సంస్థ ద్వి దశాబ్ది సన్నహాక సమావేశం లో మారుతి తన ప్రసంగం లో పేర్కొన్నారు..2006 వ సం. లో ఆవిర్భావమైన ఈ ఉద్యమ సంస్థ ప్రతినిధి బృందం రానున్న రెండు మూడురోజులు వ్యవధి తో ముఖ్యమంత్రి.ఐటి శాఖా మంత్రుల తో బాటుగా కే కే నేతృత్వం లోని కమేటీ సభ్యుల తో ప్రాతినిధ్యం చేయనున్నారు..ఇరువది వసంతాల ఉత్సవం జరుపుకొను సందర్బంగా మంథని నియోజకవర్గం లో పోరుబాట పట్టిన ఉద్యమ కారులను స్వాగతిస్తున్నమన్నారు..ఉద్యమకారుల ఐక్య విన్నపం గా సబండ వర్గీయుల మహ జన వినతి పతాక గా మంథనిచౌరస్తా లో పోష్టర్ల ఆవిష్కరణ చేస్తున్నామనీ ఈ సందర్భంగా ఫోటో ఎగ్జబిషన్.బహిరంగ సభకు ఏర్పాట్లు కొనసాగుతున్నయన్నారుఉద్యమం లో అలసిపోయీా నేటి గమనం లో సోలసి పోయినా రాష్ట్ర పోరాట శ్రేణులకు సత్వరమే ప్రయోజనాలు కలిపించేలా ముందుకేగుతామని వర్ధిల్లు తెలంగాణ ఉద్యమ సంస్థ వ్యవస్థాపక అధ్నక్షులు కొండేల మారుతీ కోరారు. బుధ, గురు, శుక్రవారం రోజులు లో నిర్వహించే ఉద్యమకారుల సంక్షేమ బావుటా లో మంథని నియోజకవర్గ స్థాయి ఉద్యమ కారులు పాల్గోని సంఘీభావం గా నిలవాలన్నారు. ఈ క్రమంలో పలువురు మద్దతు ప్రకటించిన వారిలో విభ్భిన్న వర్గీయుల ఉన్నారు..

## టి వర్క్స్ క్రీడలలో చాంపియన్‌గా నిలిచిన

# గుంజపడుగు హై స్కూల్



**మంథని ( ప్రశ్న న్యూస్)** జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ గుంజపడుగు పాఠశాల గత వారం రోజులుగా మంథని క్రీడామైదానంలో టి ఫైబర్, డ్రీమ్ స్టార్ట్ రైస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ క్రీడాంశాలలో జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ గుంజపడుగు పాఠశాల విద్యార్థులు ఘన విజయం సాధించారు. కబడ్డీ, కోకో, క్యారమ్,చెస్ లలో విజయం సాధించి గ్రౌండ్ గేమ్స్ లో మండల ఓవరాల్ చాంపియన్షిప్ ను కైవసం చేసుకున్నారు.శ్రీలక్ష్మి భారతి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా విజయతలకు బహుమతులు అందజేశారు. బహుమతులు పొందిన విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు,మండల విద్యాధికారి దాసరి లక్ష్మి ఫిజికల్ డైరెక్టర్ సమ్మయ్య , ఉపాధ్యాయ బృందం,గ్రామస్తులు అభినందించారు.

# హైదరాబాద్‌లో ఆగని కల్తీ దందాలు

**- 13 మసాలా తయారీ కేంద్రాలపై మెరుపు దాడులు చేశామన్న సజ్జనార్**

**- ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులు ఉపయోగిస్తున్నారని వెల్లడి - కల్తీరాయుళ్లపై ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక**






**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లో ఆహార కల్తీ ముఠాల ఆట కట్టించేందుకు హెచ్-ఫాస్ట్ అధికారులు భారీ స్థాయిలో దాడులు చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఆహార కల్తీలకు పాల్పడేవారిపై తనిఖీలు నిర్వహిస్తూ.. భారీ ఎత్తున కల్తీలను పట్టుకుంటున్నారు. ఈ క్రమంలోనే తాజాగా నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 25.3 టన్నుల కల్తీ మసాలా దినుసులు.. 89.15 టన్నుల ముడి పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో 13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించి 3 క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఇందులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ వెల్లడించారు. నాణ్యత లేని మసాలా దినుసులతో పాటు సింథటిక్ రంగులు, క్లాత్ డైలు, ఇండస్ట్రియల్ కలర్స్, టాల్కమ్ పౌడర్, రైస్ బ్రాన్ ఆయిల్ వంటి హానికర పదార్థాలను కలిపి నిందితులు నకిలీ మసాలాలు తయారు చేస్తున్నట్లు సీపీ సజ్జనార్ గుర్తించారు. ముఖ్యంగా వాము, జీలకర్ర, షాజీరా, లవంగాలు, ఆవాలు వంటి నిత్యావసర మసాలాల్లో కల్తీ చేస్తున్నట్లు విచారణలో తేలింది. అలాగే అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీలో టైటానియం ఆక్సైడ్ వంటి ప్రమాదకర రసాయనాలను ఉపయోగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కల్తీ పదార్థాల్లో ఉపయోగించిన కొన్ని రసాయనాలు నీటితో కడిగినా పోవని.. అందువల్ల ప్రజలు వాటిని గుర్తించడం చాలా కష్టమని సీపీ సజ్జనార్ తెలిపారు. ఇలాంటి మసాలాలను దీర్ఘకాలంగా ఉపయోగించడం వల్ల కాలేయం, మూత్రపిండాల వ్యాధులు, అల్సర్లు, అలర్జీలు, జీర్ణ సమస్యలు, క్యాన్సర్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే కల్తీదారులపై ఇకపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ తీవ్ర హెచ్చరికలు చేశారు. తీవ్రమైన కేసుల్లో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 110 కింద హత్యాయత్నం కేసులు కూడా నమోదు చేస్తామని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. త్వరలో కల్తీ ఆహార పదార్థాల కేసుల దర్యాప్తు కోసం ప్రత్యేక సిట్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. హెచ్-ఫాస్ట్ ఏర్పాటు చేసిన తర్వాత గత 140 రోజుల్లో 659 దాడులు నిర్వహించి.. 202 కేసులు నమోదు చేసి.. మొత్తం 246 టన్నులకుపైగా కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు ఆహార పదార్థాలు కొనుగోలు చేసే సమయంలో బ్రాండ్, నాణ్యత, ప్యాకింగ్‌ను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. ఎక్కడైనా కల్తీ ఆహార పదార్థాల తయారీ లేదా విక్రయాలపై అనుమానం ఉంటే వెంటనే హెచ్ ఫాస్ట్ హెల్ప్‌లైన్ 8712661212 కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు

**- గతంలో కే సీ ఆర్ చేసిన వాక్యాలు కేటీఆర్ కు గుర్తులేవా.?**
**- ఇంజనీరింగ్ విద్యార్థులను అవుహేళన చేసింది బీ ఆర్ ఎస్ ప్రభుత్వమే**
**- యువతను మోసం చేసింది గత ప్రభుత్వమే**
**- రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీలోముందంజ**
**- అభివృద్ధి ఉపాదే ప్రభుత్వ లక్ష్యం**
**- యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలి,**
**- కాంగ్రెస్ సీనియర్ నేత రామన్న గారి రాఘవేందర్ గౌడ్**



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** రాజకీయ లబ్ధి కోసం సీఎం వ్యాఖ్యలను వక్రీకరించడం తగదు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామన్న గారి రాఘవేందర్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శఎనుముల రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలను వక్రీకరించి రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు.

### గతంలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు కేటీఆర్‌కు గుర్తులేవా?

కేటీఆర్ విమర్శలు చేసే ముందు గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేసుకోవాలని రాఘవేందర్ గౌడ్ సూచించారు. ఇంజినీరింగ్ కళాశాలల సంఖ్యపై ప్రశ్నించిన విషయాన్ని, "ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులు కానిస్టేబుల్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటున్నారు" అంటూ విద్యార్థులను అవమానించేలా వ్యాఖ్యానించిన సంఘటనలను కేటీఆర్ మర్చిపోవద్దని అన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులను అవహేళన చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే నని విమర్శించారు. ఇంజినీరింగ్ విద్యా వ్యవస్థ, విద్యార్థులపై గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన వ్యాఖ్యలు యువతలో తీవ్ర నిరాశను కలిగించాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు అదే పార్టీ యువత పట్ల ప్రేమ చూపిస్తున్నట్లు మాట్లాడటం రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు.

### యువతను మోసం చేసింది గత ప్రభుత్వమే

బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు నెరవేరలేదని, ఉద్యోగాల భర్తీలో తీవ్ర జాప్యం జరిగిందని ఆరోపించారు. వేలాది మంది యువత భవిష్యత్తు అంధకారంలోకి నెట్టివేయబడిందని, ఇప్పుడు అదే నాయకులు యువత పేరుతో రాజకీయాలు చేయడం సమంజసం కాదన్నారు.

### రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగాల భర్తీలో ముందంజ

అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల ద్వారా ప్రైవేట్ రంగంలోనూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదేనని రాఘవేందర్ గౌడ్ తెలిపారు. అభివృద్ధి, ఉపాధే ప్రభుత్వ లక్ష్యం ప్రస్తుత ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల స్థాపన వంటి అంశాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు.

ఎన్నికల హామీల అమలుతో పాటు ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలి సంగ్రామ సభలు, ప్రెస్ మీట్లు పేరుతో ప్రజలను, ముఖ్యంగా యువతను తప్పుదోవ పట్టించే రాజకీయ ప్రచారాలను కేటీఆర్ విరమించుకోవాలని కౌడే మహేష్ సూచించారు. ప్రజలకు వాస్తవాలను చెప్పకుండా రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న విమర్శలు చివరికి ప్రజల విశ్వాసాన్ని కోల్పోయే పరిస్థితికి దారితీస్తాయని అన్నారు.

### ప్రజలు ఇప్పటికే తీర్పు ఇచ్చారు

ప్రజలు గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పారని, అయినా కూడా తమ వైఖరిలో మార్పు రాకపోతే భవిష్యత్తులో మరింత గట్టి సమాధానం చెబుతారని హెచ్చరించారు.


### కాంగ్రెస్ నాయకుడి హెచ్చరిక

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకుని ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక రాజకీయాలు చేయాలని కేటీఆర్‌కు రామన్న గారి రాఘవేందర్ గౌడ్ సూచించారు. ప్రజల అభివృద్ధి, యువత భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను రాజకీయ కక్షతో విమర్శించడం సరికాదని ఆయన స్పష్టం చేశారు.

# హైదరాబాద్ ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంపై కీలక అప్డేట్

**- త్వరలోనే పట్టాలెక్కనున్న పనులు**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం నిర్మాణ పనులకు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది. ఈ ప్రాజెక్టుకు ప్రధాన అడ్డంకిగా మారిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ అనుమతి త్వరలోనే రానున్నట్లు అధికారిక వర్గాల సమాచారం. ఇప్పటికే జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఈ ప్రాజెక్టుకు సంబంధించి కావాల్సిన దాదాపు అన్ని రకాల పర్యావరణ, సాంకేతిక అనుమతులను పూర్తి చేసింది. సీసీఈఏ గ్రీన్ సిగ్నల్ ఇవ్వటమే మిగిలింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి అవసరమైనపూర్తిస్థాయి కేంద్ర అనుమతులను సాధించి, క్షేత్రస్థాయి పనులను కూడా వేగవంతంగా ప్రారంభిస్తామని ఎన్‌హెచ్ఏఐ తమ తాజా వార్షిక నివేదికలో స్పష్టం చేసింది. ఎన్‌హెచ్ఏఐ సమర్పించిన ప్రణాళిక ప్రకారం సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ నుంచి ప్రారంభమై యాదాద్రి భువనగిరి జిల్లాలోని తంగడ్‌పల్లి వరకు మొత్తం 161.518 కిలోమీటర్ల పొడవునా ఈ గ్రీన్‌ఫీల్డ్ రీజినల్ ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మిస్తారు. ఈ రహదారిని అత్యంత ఆధునిక సదుపాయాలతో 6 వరుసలుగా అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక రహదారి ప్రాజెక్టు మొత్తం మూలధన వ్యయం రూ. 23,935 కోట్లుగా అంచనా. ఇందులో సివిల్ నిర్మాణ పనుల నిమిత్తం రూ. 9,362 కోట్లను కేటాయించారు. ఈ రోడ్డు నిర్మాణ పనులను హ్యామ్ పద్ధతిలో కాంట్రాక్టర్లకు అప్పగించనున్నారు. ఉత్తర భాగం పనులను వేగవంతం చేసేందుకు గాను దీనిని రెండు ప్రధాన ప్యాకేజీలుగా విభజించారు. ప్యాకేజీ-1 కింద గిర్మాపూర్ నుంచి ప్రజ్ఞాపూర్ వరకు, ప్యాకేజీ-2 కింద ప్రజ్ఞాపూర్ నుంచి తంగడ్‌పల్లి వరకు పనులను చేపట్టేందుకు ఎన్‌హెచ్ఏఐ ఈ ఏడాది మే 20న టెండర్లను ఆహ్వానించింది. ఈ టెండర్ల దాఖలుకు తొలుత జులై 6 వరకు సమయం ఇవ్వగా ఆ తర్వాత దానిని ఆగస్టు 6 వరకు పొడిగించారు. గడువు ముగియనుండటంతో ఆగస్టు 7న సాంకేతిక బిడ్‌లు తెరిచేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో సైతం కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులను త్వరితగతిన ప్రారంభిస్తామని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్‌హెచ్ఏఐ సానుకూలంగా




ఉండటంతో ఈసారి టెండర్ల గడువు పొడిగింపు లేకుండా బిడ్ల పరిశీలన పూర్తి చేసి త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించే దిశగా అడుగులు పడుతున్నాయి.

# మోదీ పోస్టు తొలగింపు వ్యవహారం

**- మెటాను ప్రశ్నించనున్న కేంద్రం**




**న్యూఢిల్లీ** సోషల్ మీడియా దిగ్గజం మెటా పనితీరుపై కేంద్ర ప్రభుత్వం మరింత దృష్టి సారించింది. సంస్థ గ్లోబల్ హెడ్ ఆఫ్ పబ్లిక్ పాలసీ జోయెల్ కాప్లాన్‌తో పాటు ఇన్‌స్టాగ్రామ్‌కు చెందిన అధికారిని ఆగస్టు 5న సమావేశానికి హాజరుకావాలని ఆదేశించింది. మెటా ఆల్గారిథమ్ ఎలా పనిచేస్తుంది? కొన్ని పోస్టులకు ఎందుకు ఎక్కువ ప్రాధాన్యం లభిస్తుందనే అంశాలపై వివరణ కోరనుంది. కొన్ని రాజకీయ పోస్టులు, ముఖ్యంగా ప్రభుత్వాన్ని విమర్శించే కంటెంట్‌కు అసాధారణ స్థాయిలో ప్రచారం లభిస్తోందన్న ఫిర్యాదులు ప్రభుత్వానికి అందినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మెటా సిఫార్సు వ్యవస్థ, కంటెంట్‌ను విస్తృతంగా చూపించే విధానం, పోస్టుల తొలగింపులో అనుసరిస్తున్న భద్రతా చర్యలపై అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పోస్టు తొలగింపును 'సాంకేతిక లోపం'గా మెటా పేర్కొంది. దీనిపై పూర్తి లిఖితపూర్వక వివరణతో పాటు క్షమాపణ కూడా ఇవ్వాలని కేంద్రం కోరనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఐటీ శాఖ కార్యదర్శి ఎస్.కృష్ణన్ మాట్లాడుతూ.. ఆగస్టు 5, 6 తేదీల్లో మెటా ప్రతినిధులతో సమావేశాలు జరుగుతాయని చెప్పారు. భారత చట్టాల అమలు, నిబంధనల వర్తింపు, కృత్రిమ మేధతో రూపొందించిన కంటెంట్, ప్రముఖుల ఖాతాలకు సంబంధించిన పోస్టుల తొలగింపులో తీసుకునే జాగ్రత్తలపై చర్చిస్తామని వెల్లడించారు. జులై 23న ప్రధానమంత్రి మోదీ విద్యార్థుల నిరసనలపై స్పందిస్తూ పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పిన సెల్ఫీ వీడియోను ఫేస్‌బుక్ కొంతసేపు తొలగించింది. తర్వాత సాంకేతిక లోపం వల్లే అలా జరిగిందంటూ మెటా ఆ వీడియోను పునరుద్ధరించి క్షమాపణ చెప్పింది. అయితే ఆ వివరణను కేంద్రం నిశితంగా పరిశీలిస్తోంది. ప్రధానమంత్రి మోదీకి సంబంధించిన ఏఐ మార్ఫింగ్ వీడియోలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో వ్యాపించడంపైనా విచారణ కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో మెటా ఇండియా అధిపతి అరుణ్ శ్రీనివాస్‌తో పాటు మరికొందరిపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ వీడియోల మూలం, వాటి వ్యాప్తి, మెటా భద్రతా వ్యవస్థ పనితీరుపై దర్యాప్తు కొనసాగుతోంది.

## కరుణానిధి మనవడిని, స్టాలిన్ కొడుకుని..

# భయపడేది లేదు

**- విడుదల తర్వాత ఉదయనిధి స్టాలిన్**



చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడులో మంగళవారం రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా వేడెక్కాయి. రాష్ట్ర ప్రతిపక్ష నేత, డీఎంకే యువజన విభాగం చీఫ్ ఉదయనిధి స్టాలిన్‌ను పోలీసులు ఈ ఉదయం అరెస్ట్ చేయడం తెలిసిందే. విచారణ అనంతరం స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. త్రిషపై డబుల్ మీనింగ్ వ్యాఖ్యల కేసులో విచారణ నిమిత్తం పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకోవడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మద్రాస్ హైకోర్టు జోక్యంతో ఉదయనిధి స్టాలిన్‌కు ఊరట లభించింది. విచారణను మంగళవారమే ముగించి, ఆయనను విడుదల చేయాలని ఉన్నత న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు, తంజావూరు జిల్లా సెంగిపట్టి పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ సుందరవదనం సమక్షంలో ఉదయనిధిని సుమారు గంటన్నర పాటు విచారించిన పోలీసులు, ఆ తర్వాత స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. అప్పటికే ఆయన దాదాపు ఎనిమిది గంటల పాటు పోలీసుల అదుపులో ఉన్నారు. విడుదలైన అనంతరం, అక్కడ గుమిగూడిన డీఎంకే కార్యకర్తల భారీ స్వాగతం మధ్య ఉదయనిధి స్టాలిన్ బయటకు వచ్చారు. ఆయన ఒక బహిరంగ వాహనంలో నిలబడి పార్టీ శ్రేణులకు అభివాదం చేశారు. కాగా, పోలీసులు తనను అదుపులోకి తీసుకోకముందే ఉదయనిధి స్టాలిన్ తరఫు న్యాయవాదులు ముందస్తు బెయిల్ కోరుతూ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. అంతకుముందు, ఉదయనిధిని తంజావూరు సౌత్ పోలీస్ స్టేషన్‌కు తరలించాలని పోలీసులు భావించారు. అయితే, అక్కడకు డీఎంకే కార్యకర్తలు భారీగా చేరుకోవడంతో భద్రతా కారణాల దృష్ట్యా విచారణ స్థలాన్ని సెంగిపట్టికి మార్చారు. తొలుత ఈ మార్పును వ్యతిరేకించిన ఉదయనిధి, ఉన్నతాధికారులతో చర్చల అనంతరం విచారణకు సహకరించారు.

# జనన మరణాల నమోదుకు కొత్త నిబంధనలు

**- పార్లమెంట్‌లో బిల్లుకు ఆమోదం!**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశంలో జనన మరణాల నమోదు ప్రక్రియను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కీలక బిల్లుకు పార్లమెంట్ ఆమోద ముద్ర వేసింది. జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు-2026కు మంగళవారం రాజ్యసభ ఆమోదం తెలిపింది. లోక్‌సభలో ఇదివరకే ఆమోదం పొందిన ఈ బిల్లు, త్వరలోనే చట్టరూపం దాల్చనుంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. తాజా సవరణల ప్రకారం, జనన లేదా మరణ ధ్రువీకరణ పత్రాలను ఆలస్యంగా నమోదు చేయాలంటే కఠిన నిబంధనలు వర్తిస్తాయి. ఘటన (పుట్టిన లేదా మరణించిన) జరిగిన ఏడాది తర్వాత (రెండేళ్ల లోపు) నమోదు చేయాల్సి వస్తే జిల్లా మేజిస్ట్రేట్ లేదా సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ నుంచి ముందస్తు అనుమతి పొందడం తప్పనిసరి. ఒకవేళ రెండేళ్లు దాటిన పక్షంలో, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు ఉంటేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ సందర్భంగా మంత్రి నిత్యానంద రాయ్ మాట్లాడుతూ, జనన మరణాలను నిర్ణీత సమయంలోగా నమోదు చేయడాన్ని ప్రోత్సహించడంతో పాటు, తప్పుడు సమాచారం, అవకతవకలను అరికట్టడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3.5 లక్షల రిజిస్ట్రేషన్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, 2014లో 86.6 శాతంగా ఉన్న జననాల నమోదు 2024 నాటికి 99 శాతానికి పైగా చేరిందని ఆయన వివరించారు. అదేవిధంగా మరణాల నమోదు 72.5 శాతం నుంచి 99.4 శాతానికి పెరిగిందని మంత్రి వెల్లడించారు. బిల్లుపై జరిగిన చర్చలో భాగంగా బీజేపీ ఎంపీ దర్శన సింగ్ మాట్లాడుతూ, ఈ కొత్త సవరణలు వ్యవస్థను మరింత సరళంగా, పారదర్శకంగా మారుస్తాయని కొనియాడారు. అయితే, రెండేళ్ల తర్వాత జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించాలనే నిబంధనపై బీజేడీ ఎంపీ డాక్టర్ సంతృప్త్ మిశ్రా కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఇప్పటికే పనిభారంతో ఉన్న న్యాయస్థానాలపై మరింత ఒత్తిడి పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వైసీపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, అన్నాడీఎంకే సహా పలు పార్టీల సభ్యులు ఈ బిల్లుకు మద్దతు తెలిపారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588